RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 26 ఏప్రిల్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:276

# నింగిలోకి దూసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న విక్రమ్-1 రాకెట్

**దేశంలోకెల్లా తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం**

**శంషాబాద్ విమానాశ్రయం ఏరో స్పేస్ పార్కు వద్ద స్కై రూట్ ఏరోస్పేస్ విక్రమ్- 1 రాకెట్ ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**సీఎంతో కలిసి చారిత్రక ఘట్టంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**స్కై రూట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు**

**దేశ చరిత్రలో ఇదొక మైలు రాయిగా నిలిచిపోతుందన్న స్కై రూట్ సీఈవో పవన్ కుమార్**

**త్వరలోనే శ్రీహరికోట నుండి నింగిలోకి రాకెట్లను పంపుతామన్న సీఈవో పవన్ కుమార్**

రంగారెడ్డి(రాజేంద్రనగర్), ఏప్రిల్ 25దివి నుంచి భువికి రాకెట్లను ప్రయోగించే జాబితాలో ఇప్పుడు ప్రైవేట్ సంస్థలు వచ్చి చేరుతున్నాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా విక్రమ్ -1 పేరుతో ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగానికి సిద్ధమయ్యింది స్కై రూట్ సంస్థ. శంషాబాద్ విమానాశ్రయం లోని ఏరో స్పేస్ పార్క్ వద్ద విక్రమ్-1 రాకెట్ తయారీకి ఆ సంస్థ కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ మేరకు శంషాబాద్ విమానాశ్రయంలోని ఏరో స్పేస్ పార్కు వద్ద స్కై రూట్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న ఆర్బిటల్ రాకెట్ విక్రం- 1 ను సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి శనివారం నాడు విక్రమ్ - 1 ఆర్బిటల్ రాకెట్ ను ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. మరోవైపు దేశ చరిత్రలోనే కాకుండా స్కై రూట్ చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందని ఆ సంస్థ సీఈవో పవన్ కుమార్ ప్రకటించారు. త్వరలోనే శ్రీహరికోట నుంచి తమ తొలి రాకెట్ విక్రం-1 ను నింగిలోకి పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. దేశ చరిత్రలో ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూపొందించే రాకెట్లను మాత్రమే శ్రీహరికోట నుంచి శాస్త్రవేత్తలు నింగిలోకి పంపుతున్నారు. అయితే ఈ రంగంలోకి ఇప్పుడు ప్రైవేటు సంస్థలు వచ్చి చేరుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ విమానాశ్రయం ఏరో స్పేస్ పార్క్ వద్ద స్కై రూట్ అనే ప్రైవేట్ సంస్థ రాకెట్ల తయారీకి వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు విక్రమ్-1 తొలి ప్రైవేట్ హాస్పిటల్ రాకెట్ ను రూపొందించిన ఈ సంస్థ.... త్వరలోనే శ్రీహరికోట నుంచి నింగిలోకి పంపడానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు శంషాబాద్ విమానాశ్రయం ఏరో స్పేస్ పార్క్ వద్ద స్కై రూట్ రాకెట్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ మేరకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి విక్రమ్-1 ఆర్బిటల్ రాకెట్ ప్రయోగానికి ఫ్లాగ్ ఆఫ్ చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా నింగిలోకి రాకెట్లను ప్రయోగించబోతున్న స్కై రూట్ సంస్థ యాజమాన్యాన్ని, సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి తోపాటు మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. స్కై రూట్ సంస్థ రాకెట్ ప్రయోగాలు సక్సెస్ కావాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రి శ్రీధర్ బాబును స్కై రూట్ సమ్స్ తో సీఈవో పవన్ కుమార్ శాలువా కప్పి మెమెంటో తో ఘనంగా సన్మానించారు.

**ఇదో చారిత్రక మైలురాయి - స్కై రూట్ సీఈవో పవన్ కుమార్**

దేశ చరిత్రలో తొలిసారిగా తమ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన విక్రమ్-1 ఆర్బిటల్ రాకెట్ ను నింగిలోకి పంపబోతున్నందుకు గర్వంగా ఉందని స్కై రూట్ సంస్థ సీఈవో పవన్ కుమార్ ప్రకటించారు. త్వరలోనే శ్రీహరికోట నుంచి విక్రమ్-1 రాకెట్ ను అంతరిక్షంలోకి పంపబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకోసం తాము పడ్డ నాలుగేళ్ల కష్టం ఫలించబోతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. 2022లో తొలిసారిగా తమ సంస్థ విక్రమ్- ఎస్ రాకెట్ ను ప్రయోగించిందని తెలిపిన సీఈఓ పవన్ కుమార్... తాజాగా ఇప్పుడు విక్రమ్ -1 రాకెట్ ను ప్రయోగించబోతున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఓ ప్రైవేట్ సంస్థ రూపొందించిన రాకెట్ ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి పంపబోతున్నట్లు, ఇది భారతదేశానికే గర్వకారణమని పవన్ కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా సరే రాకెట్ రూపొందించడానికి కనీసం 10 ఏళ్ల సమయం పడుతుందని అయితే 40 టన్నుల బరువు సామర్థ్యం కలిగి ఉన్న విక్రం-1 రాకెట్ ను తయారు చేయడానికి తమకు నాలుగేళ్ల సమయం పట్టిందని పవన్ కుమార్ వివరించారు. 300 కిలోల బరువు గల రాకెట్లను అంతరిక్షంలోకి చేర్చే సామర్థ్యం తాము రూపొందించిన విక్రమ్- 1 కు ఉందని ఆయన గర్వంగా ప్రకటించారు.






# ఆర్ఎస్ఎస్ అంటే 'రాష్ట్రీయ సరెండర్ సంఘ్"

## ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ



న్యూ డిల్లి ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )కాంగ్రెస్ అగ్రనేత రాహుల్? గాంధీ ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆర్?ఎస్?ఎస్?ను 'రాష్ట్రీయ సరెండర్ సంఘ్'గా అభివర్ణించారు. అమెరికాలో ఆర్ఎస్ఎస్ సీనియర్ లీడర్ రామ్ మాధవ్? చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

ఇటీవల వాషింగ్టన్ డీసీలో హడ్సన్ ఇన్?స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగిన 'న్యూ ఇండియా కాన్ఫరెన్స్'లో భారత్-అమెరికా సంబంధాల భవిష్యత్తుపై చర్చ జరిగింది. ఈ చర్చలో రామ్ మాధవ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని కీలక కామెంట్స్ చేశారు. భారత్ తన ప్రయోజనాలను పక్కన పెట్టి మరీ అమెరికాకు సహకరిస్తోందని చెప్పుకొచ్చారు.

అమెరికాతో స్నేహం కోసం భారత్ కొన్ని త్యాగాలు చేసిందని, తమ దేశంలోని విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదురైనప్పటికీ, ఇరాన్ నుంచి చమురు కొనడం ఆపేసినట్లు వెల్లడించారు. అలాగే రష్యా నుంచి కూడా చమురు దిగుమతులను నిలిపివేయడానికి అంగీకరించామన్నారు. అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లను స్వీకరించాల్సి వచ్చిందని, ఇంత చేస్తున్నా అమెరికాకు భారత్ సహకారం అందించడం లేదని ఎలా అంటారు? అని ఓ ప్రశ్నకు సమాధానంగా రామ్? మాధవ్ సమాధానం ఇచ్చారు.

'ఆర్ఎస్ఎస్ అంటే 'రాష్ట్రీయ సరెండర్ సంఘ్"

రామ్ మాధవ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విపక్షాలు ఎదురుదాడికి దిగాయి. ఈ క్రమంలో ఈ వీడియోపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. ఆర్ఎస్ఎస్ అంటే 'రాష్ట్రీయ సరెండర్ సంఘ్' అంటూ ఎద్దేవా చేశారు. ఆ సంఘం ద్వంద్వ నీతితో వ్యవహరిస్తోందన్నారు. నాగ్?పూర్‌లో కూర్చొని జాతీయవాదం గురించి మాట్లాడతారని, అమెరికాలో ఆ దేశానికి విధేయతగా ఉంటారంటూ దుయ్యబట్టారు. రామ్ మాధవ్ సంఘ్ అసలు స్వభావాన్ని బయటపెట్టరాని రాహుల్ విమర్శించారు.

# అజార్, కోదండరామ్ లకు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మాజీ టీమిండియా క్రికెటర్ అజారుద్దీన్, ఎం. కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో అజారుద్దీన్, కోదండరాం ఇద్దరూ మండలికి వెళ్లడం ఖరారైంది. గత ఏడాది ఆగస్ట్ 30న ఈ ఇద్దరిని ఎమ్మెల్సీలుగా నియమించాలని తెలంగాణ కేబినెట్ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపింది. అయితే అప్పటి నుంచి ఈ ఫైల్ పెండింగ్‌లోనే ఉంది.ఇప్పుడు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పరిస్థితి మారింది. ముఖ్యంగా అజారుద్దీన్ మంత్రి పదవి.. ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపైనే ఆధారపడి ఉండటంతో తాజా నిర్ణయంతో ఆయన మంత్రిగా కొనసాగడం స్పష్టమైంది.

స్వయంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

తెలంగాణ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న అజారుద్దీన్.. పదవిలో కొనసాగాలంటే ఏప్రిల్ 30 లోపు శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వడం తప్పనిసరి.. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వారు ఆరు నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యత్వం పొందాల్సి ఉంది.. ఒకవేళ ఏప్రిల్ 30 లోపు గవర్నర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోతే అజారుద్దీన్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఇంతకాలం గవర్నర్ కోటాలో పెండింగ్ లో ఉన్న అజారుద్దీన్, కోదండరాం పేర్లను పరిశీలించాలని.. గ్రీన్ సిగ్నన్ ఇవ్వాలని.. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కలిసి సుధీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలోనే.. వారి అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదించారు.

# ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరిస్తాం.

**ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు స్వీకరించడం మంచి పరిపాలనకు నిదర్శనం**

**ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలకు ప్రజా దర్బార్ వారధి**

**మంత్రి పొంగులేటి**

వార్తా 2 లో



ప్రజాబలం

26 ఏప్రిల్ 2026 ఆదివారం

# హిట్ తక్కువ.. హిస్టరీ ఎక్కువ

ప్రజల నమ్మకమే పార్టీకి ప్రాణం.. అది కోల్పోతే ఎంతటి వారైనా చరిత్ర పుటల్లో పేర్లుగా మిగలడం అనివార్యం.'తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రం ఎప్పుడూ ఆసక్తికరమే. సిద్ధాంతాల కంటే సంచలనాలకే ఇక్కడ పెద్దపీట. పవర్‌కోసం పుట్టి.. విలీనాల్లో ముగిసిన పార్టీల కథలుమెజారిటీ పార్టీలు మనుగడ కోసం పెద్ద పార్టీల్లో కలిసిపోతున్నాయి. సిద్ధాంతం కంటే వ్యక్తుల చుట్టూ రాజకీయాలు తిరగడం వల్ల నేత వెనుకబడితే పార్టీ కనుమరుగవుతోంది. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ లేకపోవడం, కేవలం ఎన్నికల ముందే హడావుడి చేయడం కూడా పలు సందర్భాలలో కనిపించింది.తెలుగు రాజకీయ చరిత్రను గమనిస్తే.. 'ప్రజల నమ్మకమే పార్టీకి ప్రాణం.. అది కోల్పోతే ఎంతటి వారైనా చరిత్ర పుటల్లో పేర్లుగా మిగలడం అనివార్యం జాగృతి నేత, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు తెలుగు రాష్ట్రాల్లో మరోసారి 'ప్రాంతీయ పార్టీల' ప్రస్థానంపై చర్చ మొదలైంది. ఉమ్మడి ఎపినుంచి నేటి విభజిత రాష్ట్రాల వరకు తెలుగు రాజకీయ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టాయి, కొన్ని చరిత్ర సృష్టించాయి, మరికొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి గమనిస్తే ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ గురించి చెప్పాలి. తెలుగు రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీ అంటే గుర్తొచ్చే మొదటి పేరు తెలుగుదేశం.1982లో నందమూరి తారకరామారావు స్థాపించిన ఈ పార్టీ కేవలం 9 నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకుని రికార్డు సృష్టించింది. ఢిల్లీ పెత్తనానికి వ్యతిరేకంగా 'తెలుగువారి ఆత్మగౌరవం' నినాదంతో పుట్టిన ఈ పార్టీ, నాలుగు దశాబ్దాల తర్వాత కూడా నేడు ఆంధ్రప్రదేశ్‌లో అధికార పీఠంపై ఉండి తన ఉనికిని చాటుకుంటోంది. మరోవైపు, రైతు నాయకుడు ఆచార్య ఎన్.జి. రంగా స్థాపించిన కిషికార్ లోక్ పార్టీ, రాజగోపాలాచారి స్థాపించిన స్వతంత్ర పార్టీ ఒకప్పుడు ఉమ్మడి ఎపిలో బలమైన ముద్రవేసినప్పటికీ, కాలక్రమేణా పెద్ద పార్టీల్లో విలీనమై అంతర్ధానమయ్యాయి. 1969లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా సమితి 1971 లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలకు గాను 10 గెలిచి ప్రభంజనం సృష్టించినా, చివరకు కాంగ్రెస్‌లో విలీనమై ఒక అధ్యాయాన్ని ముగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 ఆగస్టు 26న తిరుపతిలో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం 18% ఓట్లు సాధించినా రెండేళ్లకే కాంగ్రెస్‌లో విలీనమైంది. మాజీ సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి స్థాపించిన జై సమైక్యాంధ్ర, వి.వి. లక్ష్మీనారాయణ స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ వంటివి ఓటర్లను ఆకట్టుకోవడంలో వెనుకబడ్డాయి. రాష్ట్రవిభజనను వ్యతిరేకిస్తూ అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి 2014లో జై సమైక్యాంధ్ర పార్టీ పార్టీని స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఈ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. మెజారిటీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఎన్నికల తర్వాత కిరణ్ కుమార్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ దెబ్బతిన్నది. తర్వాత ఆయన బిజెపిలో చేరిపోయారు. ఎన్‌టిఆర్ మరణానంతరం లక్ష్మీపార్వతి స్థాపించిన ఎన్‌టిఆర్ టిడిపి, నందమూరి హరికృష్ణ స్థాపించిన అన్నా టిడిపి కూడా వారసత్వ పోరులో నిలబడలేకపోయాయి. ఐఎఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ 2006లో రాజకీయ సంస్కరణల కోసం స్థాపించిన లోక్ సత్తా పార్టీ కూకట్‌పల్లి నుంచి ఒక సీటు గెలిచినప్పటికీ, కాలక్రమేణా ఎన్నికల రాజకీయాలకు దూరమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ వివిధ ప్రజాసంబంధ అంశాలపై ఆ పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పోరాటాలు సాగిస్తున్నారు. ఇక సంచలనాల కె.ఎ.పాల్ 2008లో రాజకీయాల్లోకి ప్రవేశిస్తూ ప్రజాశాంతి పేరిట ప్రాంతీయ పార్టీని స్థాపించారు. 2009లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని స్థానాల్లో పోటీ చేసినా చెప్పుకోదగ్గ ఓట్లు సాధించలేకపోయింది. తర్వాత 2019 లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది. పాల్ స్వయంగా నరసాపురం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసి కేవలం 3,046 ఓట్లు (0.3%) మాత్రమే సాధించారు. 2024లో విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసినప్పటికీ, కేవలం 7,529 ఓట్లు మాత్రమే పొంది ఓటమి పాలయ్యారు. ఈ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రాజకీయ ప్రభావం చాలా తక్కువనే చెప్పాలి. తెలంగాణ సాధన సమితి పేరిట ఆలే నరేంద్ర స్థాపించిన ఈ పార్టీ తర్వాత టిఆర్‌ఎస్ (ప్రస్తుతం బిఆర్‌ఎస్)లో విలీనమైంది. అలాగే తల్లి తెలంగాణ పార్టీ పేరిట ప్రస్తుత కాంగ్రెస్ ఎంఎల్‌సి, నటి విజయశాంతి స్థాపించిన ఈ పార్టీ కూడా తర్వాత టిఆర్‌ఎస్‌లో విలీనమైపోయింది. అయితే ఈ రెండు పార్టీలను తమ పార్టీలో చేర్చుకునేంతవరకు ఆదరించిన కెసిఆర్ తర్వాత నరేంద్ర, విజయశాంతికి మొండిచేయి చూపడమేగాక వారు పార్టీ నుంచి వెళ్లిపోయేలా వ్యవహరించారన్న విషయం ప్రచారంలో ఉంది. అటువంటి కెసిఆర్ పార్టీని వ్యతిరేకిస్తూ ఇప్పుడు స్వయంగా ఆయన కూతురు కవిత వేరుకుంపటి పెట్టడం చర్చనీయమైంది. గతంలో జై తెలంగాణ పార్టీ పేరిట పి. ఇంద్రారెడ్డి స్థాపించిన పార్టీ ఆయన మరణం తర్వాత ఉనికిని కోల్పోయింది. ఆయన సతీమణి కాంగ్రెస్ టిక్కెట్‌పై గెలిచి తర్వాత కాలంలో కెసిఆర్ పంచన చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ పరిరక్షణ సమితి పేరిట బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి స్థాపించిన పార్టీ కూడా ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వారసత్వ యుద్ధం, సినీ గ్లామర్ రెండు ప్రధాన పార్టీలకు జన్మనిచ్చాయి. కాంగ్రెస్ అధిష్టానంపై తిరుగుబాటు చేసి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఒక ప్రాంతీయ పార్టీగా అత్యంత వేగంగా అధికారంలోకి వచ్చింది.. రాజశేఖర్‌రెడ్డి వారసత్వాన్ని అందిపుచ్చుకుని 2019లో భారీ విజయాన్ని అందుకుంది. అయితే శివ కుమార్ అనే వ్యక్తి 2010 -11 ప్రాంతంలోనే 'వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ' పేరును కేంద్ర ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ చేయించారు. జగన్ మోహన్‌రెడ్డి తన పార్టీకి ఇదే పేరును వాడుతుండటంతో, శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలైన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తనదేనని, జగన్ తన పేరును అక్రమంగా వాడుకుంటున్నారని ఆయన కోర్టును ఆశ్రయించారు. జగన్ పార్టీని తన పార్టీలో విలీనం చేయాలని లేదా జగన్ కొత్త పేరు పెట్టుకోవాలని ఆయన వాదించారు. ఈ వివాదం నడుస్తున్న సమయంలోనే, జగన్ మోహన్‌రెడ్డి వర్గం శివకుమార్‌తో చర్చలు జరిపింది. చివరకు శివకుమార్ తన పార్టీని జగన్ నాయకత్వంలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి అంగీకరించారు. దీనితో సాంకేతికంగా శివ కుమార్ స్థాపించిన పార్టీయే ప్రస్తుత వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీగా కొనసాగింది. ఈ విలీనం తర్వాత, కేంద్ర ఎన్నికల సంఘం జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడిగా గుర్తిస్తూ, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి 'ఫ్యాన్' గుర్తును కేటాయించింది. మరోవైపు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో 'వైఎస్‌ఆర్' అంటే 'యువజన శ్రామిక రైతు' కాంగ్రెస్ పార్టీ అని అర్థం. అయితే, దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఫోటో, పేరును వాడుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేసింది. కానీ జగన్ తన పార్టీ పేరులో వైఎస్‌ఆర్ అంటే 'యువజన శ్రామిక రైతు' అని స్పష్టం చేయడంతో ఆ వివాదం సద్దుమణిగింది. ఇక ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ సుదీర్ఘ పోరాటం తర్వాత 2024లో ఎపి ప్రభుత్వంలో భాగస్వామిగా మారి కీలక శక్తిగా ఎదిగింది. 2014, మార్చి 14న హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ఈ పార్టీని ప్రకటించారు. పార్టీ స్థాపించిన వెంటనే వచ్చిన 2014 ఎన్నికల్లో జనసేన నేరుగా పోటీ చేయలేదు. 'రాష్ట్ర విభజన' నేపథ్యంలో అనుభవం ఉన్న నాయకత్వం కావాలని భావించి టిడిపి -బిజెపి కూటమికి మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో కూటమి విజయంలో జనసేన కీలక పాత్ర పోషించింది. 2019లో జనసేన తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగింది. వామపక్షాలు, బిఎస్‌పితో కలిసి కూటమిగా పోటీ చేసింది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను జనసేన 137 స్థానాల్లో పోటీ చేసింది. కేవలం 1 స్థానంలో (రాజోలు -రాపాక వరప్రసాద్- తర్వాత ఆయన వైసిపి తీర్థం పుచ్చుకున్నారు) మాత్రమే విజయం సాధించింది.18 లోక్‌సభ స్థానాల్లో పోటీచేసి, ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. పవన్ కల్యాణ్ గాజువాక, భీమవరం సీట్లనుంచి పోటీ చేసి, స్వల్ప తేడాతో రెండు చోట్లా ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ టిడిపి, బిజెపిలతో కలిసి 'మహాకూటమి'గా పోటీ చేసింది.






**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** 12 గంటల సుధీర్ఘ చర్చలతో ప్రజాపాలనలో ప్రజాప్రభుత్వంలో ఆర్‌టీసీ కార్మికుల కష్టాలు తీర్చిన ప్రజానాయకుడు రేవంత్ రెడ్డి చిత్రపటానికి గాంధీభవన్‌లో పాలభిషేకం చేసి టపాసుల పేల్చి స్వీట్లు పంచిన ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు .ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.రోహిత్ ముదిరాజ్ , ప్రభుత్వ ఫిషరిస్ కమిటీ ఛైర్మెన్ మెట్టు సాయికుమార్ ,ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్.ధన్‌రాజ్ ఖాదర్ ,శ్రీనివాస్ ,జయశంకర్ , తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై ప్రజా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి క్షేత్రస్థాయి సమీక్షలు

## ఈ నెల 27 న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు

హైదరాబాద్ :- ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా
మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తి గా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారుఅంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్



పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు.

ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

# ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరిస్తాం.








పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ పరిధిలోనీ గ్రామ పంచాయతీలలో ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.శనివారంనాడు సాయంత్రం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పాల్గొని ప్రజల తీసుకొచ్చిన సుమారు 1300 వందల అర్జీలను తీసుకుని వాటి పరిష్కారానికి భరోసా కల్పించడం జరిగింది.ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను గరిష్టంగా మూడు నెలలలోపు పరిష్కరించేలా కార్యచరణ రూపొందించాం. ప్రజాదర్బార్ లో అప్లికేషన్ ఇచ్చిన రెండు రోజుల్లోనే దరఖాస్తుదారుడి ఫోన్ నెంబరుకు నమోదు చేసుకున్న వివరాలు పంపించడం జరుగుతుంది.

పేద ప్రజల సంక్షేమానికి భద్రత, భరోసా కల్పించడమే అజెండాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. అభివృద్ధిని ఎక్కడా చిన్న చూపు చూడకుండా పెండింగ్ పనులను పూర్తి చేస్తూ, గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం.పేద ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ల లోనే ప్రజల వద్దకే అధికారులను పంపి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి సంక్షేమ కార్యక్రమాలు అందించాం.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి వారం ఒక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు మేలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో బాగంగానే ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని సత్వర పరిష్కారించేలా అధికారులకు ఆదేశాలివ్వడం జరిగింది.సుబ్లేడు గ్రామానికి నూతన పోలీస్ స్టేషన్ మంజూరుకు ప్రభుత్వ అనుమతి తీసుకొని త్వరలోనే శంకుస్థాపన చేసుకొందామని, స్థానిక చెరువుని రిజర్వాయర్ చేయడానికి కూడ కావాల్సిన అనుమతులు కూడ తీసుకుని, నూతన మండలం ఏర్పాటు గురించి కూడ గ్రామ ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.శనివారంనాడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నేలకొండపల్లి మండలంలో వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 55 శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చినవే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేయడంతో ప్రజల్లో విశ్వాసం పెరిగింది. మే నెలలో రెండవ విడత, తదుపరి విడతల్లో కూడా అర్హులైన పేదలకు ఇండ్లు అందిస్తాం. ధరణి కారణంగా ఏర్పడిన భూ సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించే ప్రయత్నం జరుగుతుంది., సాదా బైనమా దరఖాస్తులను కూడ పరిష్కారానికి మార్గం సుగమం చేశాం.ఆసరా పెన్షన్, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్రమపద్ధతిలో పరిష్కరిస్తామని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలోపోలీస్ కమీషనర్ సునీల్ దత్ , అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ , పి.శ్రీనివాస్ రెడ్డి , గ్రామ సర్పంచులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితపై గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి ఫైర్



వరంగల్ ఏప్రిల్ 25 )ఈరోజు కల్వకుంట్ల కవిత పార్టీ పెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గారిపై అనుచిత వ్యాఖ్యలను గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి తీవ్రంగా ఖండించారు నీ కుటుంబ కలహాలతో ఆస్తి పంపకాలలో తేడాలు వచ్చి మీరు మీరు కొట్టుకొని బయటికి వచ్చిన నువ్వు ఢిల్లీలో లిక్కర్ స్కామ్ లో జైలుకి వెళ్లిన నువ్వు సీఎం రేవంత్ రెడ్డి గారిని కర్కోటకుడు హిట్లర్ మూర్ఖుడు అనడాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాము నీకు దమ్ము ధైర్యం ఉంటే మొన్న పార్లమెంట్లో మహిళా బిల్లు మీద అమర నిరాహార దీక్ష ఎందుకు చేయలే నీకు బీసీల మీద ప్రేమ ఉంటే 42% రిజర్వేషన్ మీద ఢిల్లీలో అమర నిరాహార దీక్ష కూర్చున్నాక అప్పుడు నువ్వు బీసీల గురించి మాట్లాడు నువ్వు దళితుల మీద ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నావు నీకు నిజంగా దళితుల మీద ప్రేమ ఉంటే నీ కొడుకును దళితురాలికిచ్చి పెళ్లి చెయ్ నీకు మైనార్టీల మీద ప్రేమ ఉంటే బుర్జ్ ఖలీఫా దుబాయ్ లో నీ ఆస్తులను అమ్మి మైనార్టీలకు పంచు ఢిల్లీలో లిక్కర్ స్కామ్ లో కొన్ని కోట్లు సంపాదించి డబ్బు గురించే జైలుకుపోయి శిక్ష అనుభవించి కేసును కొట్టించడానికి బిజెపి నాయకుల కాలు మొక్కి మొక్కిన నువ్వు కాంగ్రెస్ గురించి మాట్లాడుతున్నావా నువ్వు కాంగ్రెస్ పార్టీలో చేర్చానని బారసారాలు నడిపితే నిన్ను ఎవరు పట్టించుకోలేదు అన్ని పార్టీలు తిరిగి ఏ పార్టీల అవకాశమయినప్పుడు నువ్వు ఒక కొత్త పార్టీ పెట్టి తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళలను మోసం చేయడానికి నాటకం నీకు దమ్ము ధైర్యం ఉంటే నువ్వు రేపు ఎలక్షన్లలో ఒంటరిగా పోటీ చేయాలి నీ యొక్క పార్టీకి రేపు ఎలక్షన్లో అభ్యర్థులే కరువైతారు రేపు నువ్వు ఏదో ఒక సీటు గురించి ఒక పార్టీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నావు నిరుద్యోగులకు 4 లక్షల ఉద్యోగాలంటూ నువ్వు చేసిన వాక్యాలు 4 లక్షల ఉద్యోగాలు ఏ డిపార్ట్మెంట్ లో ఎన్ని ఉద్యోగాలు వాటికి ఎన్ని లక్షల బడ్జెట్ అనేది బహిరంగంగా చెప్పాలి విద్య వైద్యం ఇంకా తదితర అంశాలపై నువ్వు చేసిన వాక్యాలు వాటి మీద నీకు స్పష్టత ఉంటే అవి బహిరంగంగా చెప్పాలి ఫస్ట్ నువ్వు నీ అక్రమంగా సంపాదించిన ఆస్తులన్నీ ఇప్పుడు ఆర్టీసీ కార్మికులు చేసే సమ్మెకు వారి యొక్క కోరికలకు నీ ఆస్తులను వారికి రాసి ఇవ్వాలి అప్పుడే నిజమైన టిఆర్ఎస్ పార్టీ మీద అయితది అంతేగాని తప్పుడు వాక్యాలు చేయడం రాజకీయాల గురించి పదవుల గురించి అబద్ధాలు ఆడడం మానుకోవాలి త్వరలో మహిళలు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు మైనార్టీలు తగిన బుద్ధి చెప్తారని వెంటనే కాంగ్రెస్ పార్టీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ సోలో జహీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధి రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



హైద్రాబాద్ ఏప్రిల్ 25 క్రీడల అభివృద్ధి కేవలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పాటు క్రీడా సంఘాలువివిధ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సమిష్టిగా కృషి చేసినప్పుడే సమగ్ర క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

ఈరోజు నుండి మూడు రోజులపాటు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో శ్రీనగర్ లో జరుగుతున్న చింతన్ శిబిర్ 2026కు తెలంగాణ నుండి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడా సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్ తదితరులు హాజరయ్యారు.

ఈరోజు జరిగిన కార్యక్రమాల్లో తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, దేశంలో మంచి, బలమైన క్రీడా వాతావరణం నిర్మాణం జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేయాలని దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా భవిష్యత్తు కార్యాచరణ ఉండాలని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ఒకవైపు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు చేస్తూనే, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే అనేక కార్యక్రమాలను రూపొందించి బ్రహ్మాండంగా నిర్వహిస్తుందని మంత్రి వివరించారు.

హైదరాబాద్ అంటేనే ఆటలకు మారుపేరుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు క్రీడా శాఖ అనేక వినూత్నకార్యక్రమాలు రూపొందించిందని , గ్రామీణ స్థాయి నుండి క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందుకు రెండు దఫాలుగా నిర్వహించిన సీఎం కప్ 2024ఢ 20 25లు ఉదాహరణ అని మంత్రి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా కార్యక్రమాలను, జాతీయ క్రీడా దినోత్సవంను "సండే ఆన్ సైక్లింగ్" ఒలంపిక్స్ విజేతలను గుర్తించే కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రం దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తుందని మంత్రి వివరించారు.

ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో పాటు క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి, క్రీడా ప్రముఖులు పుల్లెల గోపీచంద్ గగన్ నారాయణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవితేజ తదితరులు ఈ శిబిరంలో తెలంగాణ తరపున పాల్గొంటున్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా 'పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ్ అభియాన్' కార్యక్రమం

## పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

హైద్రాబాద్ ఏప్రిల్ 25 :ఇటీవల బెంగళూరులో నిర్వహించిన కీలక సమావేశంలో భాగంగా, జిల్లాల స్థాయిలో కూడా శిక్షణా తరగతులు నిర్వహించాలని నిర్ణయించాం. మండల స్థాయిలో పొందిన అనుభవాలను జిల్లా స్థాయిలో మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశాం.

భారతీయ జనతా పార్టీలో కార్యకర్తలకు సైద్ధాంతిక బోధన, పార్టీ కార్యపద్ధతి, క్రమశిక్షణ, రాజకీయ కార్యాచరణ, భవిష్యత్ రోడ్‌మ్యాప్ వంటి అంశాలపై ప్రతి సంవత్సరం అన్ని స్థాయిల్లో శిక్షణ ఇవ్వడం మా ప్రత్యేకత. ఇప్పటికే మండల స్థాయిలో 50 వేల మందికి పైగా కార్యకర్తలు శిక్షణ పొందారు.

ఈ శిక్షణలో పార్టీ నిర్మాణం, సిద్ధాంతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సాంకేతిక అభివృద్ధి వంటి ఏడు ప్రధాన అంశాలపై విస్తృతంగా చర్చించాం. జిల్లా స్థాయిలో మరింత లోతుగా చర్చించనున్నాం.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. కార్యకర్తల ఐక్యత, సిద్ధాంతపట్ల నిబద్ధత, కృషి.. ఈ మూడు కలిస్తే రాబోయే రోజుల్లో బిజెపి అధికారంలోకి రావడంఖాయమన్నారు. ఈరోజు రాజకీయాల్లో మార్పులు వేగంగా జరుగుతున్నాయి. పార్టీలు పెట్టడం




సులభమైపోయింది. కానీ ప్రజల కోసం నిజంగా పని చేసే పార్టీ ఏది అనేది ప్రజలు గమనిస్తున్నారు. ప్రజల సంక్షేమాన్ని నిజాయితీగా ఆలోచించే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే.

గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోంది.

టీఆర్ఎస్, బీఆర్ఎస్ పేర్లు మారినా పాలన మారలేదు. రాష్ట్ర సంపదను దోచుకున్న వారే ఇప్పుడు ప్రజల ముందుకు వస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నుంచి రూ.1000 కోట్లు ఢిల్లీ కాంగ్రెస్ అధిష్టానానికి పంపిస్తామని చెబుతున్నారు. అయితే అందులో కనీసం రూ.500 కోట్లు ఉద్యోగుల సంక్షేమానికి కేటాయించాలనే ఆలోచన ఎందుకు రావడం లేదు?

దేశంలోనూ, రాష్ట్రంలోనూ అవినీతి రహిత పాలన అందించగల ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమే. "రాబోయేది బిజెపి ప్రభుత్వమే" అన్న విశ్వాసంతో కార్యకర్తలు కష్టపడాలి.

తెలంగాణ సాధన సమయంలో పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ప్రతినిధులు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కూడా పూర్తిస్థాయిలో పోరాడలేదు. తెలంగాణ కోసం నిజాయితీగా పోరాడింది బిజెపి మాత్రమే నన్నారు

# రాజి మార్గమే రాజమార్గం లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా జడ్జి బోయ శ్రీనివాసు లు.




నారాయణపేట ఏప్రిల్ 25: రాజి మార్గమే రాజమార్గమని అందుకు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్లో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశింషి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులుమాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జూన్ 20న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. లోక్ అదాలకు కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకు జరిగిన మార్చ్ 28వ తేదీన జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించి మొత్తం 5149 కేసులు డిస్పోసల్ చేసి నారాయణపేట డిస్టిక్ 18వ ర్యాంకు స్థానంలో ఉన్నాము అనీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోలీస్ అధికారులకు అభినందించారు. ఈ ర్యాంకు రావడానికి కృషిచేసిన పోలీసులు అధికారులు జిల్లా ఎస్పీ శ్రీ వినీత్ కోర్ట్ కానిస్టేబుల్ లను అభినందించారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగాకొనసాగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో న్యాయమూ ర్తులు సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ డి ఎల్ ఎస్ ఏ వింధ్య నాయక్, బి.మనోజ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, సుస్మిత జూనియర్స్ సివిల్ జడ్జి అవినాష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, డీఏస్పీ , పోలీస్ సిబ్బంది, ఆర్ అండ్ బి రాములు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక రాష్ట్రం తోనే వైసిపికి పూర్వ వైభవం!

కర్నూలు, ఏప్రిల్ 25 ఎలాగైనా పూర్వ వైభవం సాధించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. కూటమి దూకుడు చూస్తుంటే అది సాధ్యమయ్యే పని కాదు అని తెలుస్తోంది. ఈ తరుణంలో కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో ప్రాంతీయ విద్వేషాలను రగిలించేందుకు కూడా వెనుకడుగు వేయడం లేదని కూటమి ఆరోపిస్తోంది. ఏ రాయలసీమ ను అడ్డం చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందో.. అదే ప్రాంతాన్ని ఎటువంటి అభివృద్ధి చేయలేదు ఆ పార్టీ. ప్రధానంగా సాగునీరు, పారిశ్రామిక అభివృద్ధి వంటి కీలక రంగాల్లో చేసిందేమీ లేదు. కానీ ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే రాయలసీమ ప్రయోజనాల పేరిట కొత్త నాటకం ప్రారంభించింది ఆ పార్టీ. అమరావతి పై విషం చిమ్ముతూ.. డబ్బునంత అక్కడే ఖర్చు పెడుతున్నారంటూ సీమ ప్రజలలో వ్యతిరేక భావన వచ్చేలా ప్రయత్నిస్తోంది. గతంలో మూడు రాజధానులు అన్నది వైయస్సార్ కాంగ్రెస్. అప్పట్లో న్యాయ రాజధాని పేరుతో కర్నూలుకు ఒక హైకోర్టు ప్రతిపాదన చేసింది. ఇప్పుడేమో మావిగన్ అంటూ అమరావతి పక్కనే నగరాలను కలుపుతూ రాజధాని చేయాలని చూస్తోంది. మరోవైపు రాయలసీమకు అన్యాయం జరుగుతోందంటూ కొత్త నినాదాలు అందుకుంది. ఐదేళ్ల లో రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కానీ.. ఉపాధి కల్పనలో కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. హంద్రీ నీవా, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసింది. ఇప్పుడు రాయలసీమ ప్రయోజనాల పేరుతో అక్కడి ప్రజల్లో ఒక రకమైన వ్యతిరేక భావన ప్రభుత్వం పై వచ్చేలా పన్నాగం పన్నుతోంది. అమరావతి పై విషం చిమ్మడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆపడం లేదు. దానిని రాయలసీమలో మూడు పెడుతూ ప్రచారం చేస్తోంది. కానీ అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆర్థిక వనరు కూడా. అక్కడ సృష్టించే ప్రతి రూపాయి, సంపద రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి దోహదం చేయనుంది. సమాజంతో పాటు పరిస్థితులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికి ఇది తెలిసిందే. ఇప్పటికే రాష్ట్ర విభజన జరిగి రెండు రాష్ట్రాలు ఎంతలా నష్టపోయాయి తెలియంది కాదు. ఇప్పుడు ప్రత్యేక ప్రాంతం నినాదాన్ని ప్రజలు లెక్క చేసే స్థితిలో లేరు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు కూడా వర్కౌట్ కావు.

# అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన చర్చల కొనసాగింపుపై నెలకొన్న అనిశ్చితి..?



న్యూ డిల్లి ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్) పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్? వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య రెండో విడత చర్చలు జరగనున్న నేపథ్యంలో కీలక పరిణామం జరిగింది. చర్చల కోసం ఇస్లామాబాద్‌కు వచ్చిన అమెరికా ప్రతినిధి బృందాన్ని కలవడానికి టెహ్రాన్ ఇంకా వెనుకాడుతోంది. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో ఇరుపక్షాల మధ్య జరగాల్సిన శాంతి చర్చల అవకాశాలు సన్నగిల్లుతున్నాయని పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ వార్తా సంస్థ ఏఆర్‌వై న్యూస్ ఛైర్మన్ కమ్రాన్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. వారాంతంలో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన చర్చల కొనసాగింపుపై అనిశ్చితి నెలకొందని విశ్వసనీయ వర్గాలు సూచిస్తున్నాయని కమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు. శనివారం ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన రెండో విడత చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు వేగంగా సన్నగిల్లుతున్నాయని పేర్కొన్నారు. ఎందుకంటే శనివారం రాత్రి ఇస్లామాబాద్‌కు రానున్న అమెరికా ప్రతినిధి బృందాన్ని కలవడానికి టెహ్రాన్ ఇంకా సిద్ధంగా లేదని తెలిపారు. అలాగే ఇరు దేశాల మధ్య చర్చలను తిరిగి ప్రారంభించడానికి ఇరాన్ ఒక గట్టి ముందస్తు షరతు విధించిందని చెప్పారు. అది ప్రపంచ చమురు రవాణా మార్గమైన వ్యూహాత్మక హర్మూజ్ జలసంధికి సంబంధించినదని వెల్లడించారు. రెండో విడత చర్చలు జరపాలంటే అమెరికా నౌకాదళం తమ ఓడరేవులపై విధించిన దిగ్బంధనాన్ని యూఎస్ ముందుగా ఎత్తివేయాలని ఇరాన్ పట్టుపడుతోందన్నారు.

# ముగిసిపోయిన అధ్యాయం మళ్ళీ తెరపైకి...

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నరవణె పరోక్షంగా విమర్శలు

న్యూ డిల్లి ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్)భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకంపై నెలకొన్న వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. ఆ అంశంపై తాజాగా స్పందించిన నరవణ, ప్రచురణకు ముందే తన పుస్తకాన్ని వెలుగులోకి తీసుకువచ్చి అనవసరంగా వివాదంలోకి లాగారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు.




ఇటీవల ఆయన రచించిన ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్: అన్ ఎర్తింగ్ మిలిటరీ మిత్స్ అండ్ మిస్టరీస్ పుస్తకం విడుదలైంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ ఇచ్చిన ఇంటర్వ్యూలో నరవణె పలు విషయాలను వెల్లడించారు. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం వివాదం గురించి మాట్లాడిన ఆయన, ఆ అంశం తనకు ముగిసిపోయిన అధ్యాయం అని స్పష్టం చేశారు. నరవణె మాట్లాడుతూ, “రక్షణ మంత్రిత్వశాఖ పుస్తకాన్ని పూర్తిగా పరిశీలించే వరకు ప్రచురణను నిలిపివేయాలని ప్రచురణకర్తలకు సూచించింది. ఆ నిర్ణయంతో విషయం అక్కడితో ముగిసిపోయింది. నేను కూడా ముందుకు సాగాను. అయితే ప్రచురితం కాని పుస్తకాన్ని బయటకు తీసుకువచ్చి దానిపై చర్చలు జరపడం, నన్ను కూడా అందులోకి లాగడం సమంజసం కాదు” అని పేర్కొన్నారు.

ఈ పుస్తకం నేపథ్యంలో గల్వాన్ ఘర్షణల సమయంలో ప్రభుత్వ వైఖరిపై కొన్ని అంశాలు ప్రస్తావనకు రావడం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. అదే సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ఈ పుస్తకంలోని విషయాలను ప్రస్తావించేందుకు ప్రయత్నించడం కూడా రాజకీయంగా చర్చకు దారితీసింది. ప్రచురణకు రాని పుస్తకంలోని అంశాలను సభలో ప్రస్తావించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఇప్పుడు ఆ ఘటనను గుర్తుచేసుకుంటూ నరవణ, తనను అనవసరంగా హైలైట్ చేశారని అన్నారు.

పుస్తకంలో జైహింద్ నినాదం మూలాలు

“ప్రచురణ కాని పుస్తకాన్ని కోట్ చేస్తూ నన్ను వెలుగులోకి తీసుకురావడం అవసరం లేదు. అది సరైన చర్య కాదు” అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే, పుస్తక రచయితగా నరవణె కొత్త దిశలో ముందుకు సాగుతున్నారు. వివాదం తర్వాత ఆయన రెండు పుస్తకాలు రచించగా, వాటిలో ఒకటి ఇప్పటికే విడుదలైంది. మరో పుస్తకం కూడా త్వరలోనే రానుందని తెలిపారు. తన తాజా పుస్తకం గంభీరమైన అకాడమిక్ గ్రంథం కాకుండా పాఠకులను ఆకట్టుకునే విధంగా ఉండేలా రాసినట్లు చెప్పారు. ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్ పుస్తకంలో భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనలకు సంబంధించిన ఆసక్తికర కథనాలు, అపోహలు, చారిత్రక అంశాలను వివరించారు. ముఖ్యంగా జైహింద్ నినాదం మూలాలు గురించి ఆయన ప్రస్తావించారు. ఈ నినాదం స్వాతంత్ర్య సమర కాలం నుంచి ఎలా ప్రారంభమై, తరువాత భారత సాయుధ దళాల్లో ఎలా విస్తరించిందో వివరించారు.

# బీసీ ఉద్యమానికి మద్దతు కూడగడతాం..

### జూలై చివరి వారంలో మోడీకి మద్దతుగా చలో ఢిల్లీ..
### మైసూర్ రాజుతో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ..
### ముఖ్యఅతిథిగా రావాలని విజ్ఞప్తి..
### బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్

మైసూర్ ఏప్రిల్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బీసీ ఉద్యమానికి మద్దతు కూడగడతాం అనిబీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ర్యాగ అరుణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం మైసూర్ యువరాజు పార్లమెంట్ సభ్యులు యధువర్ కృష్ణ దత్త చమరాజ ను కలిసి చలో ఢిల్లీ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ హోదా కల్పించడం, జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలను రెండు సంవత్సరాలుగా నిర్వహించడం, జనగణనలో కుల గణన చేపట్టిన కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతుగా జూలై చివరి వారంలో ఢిల్లీ పేరిట చలో ఢిల్లీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని మైసూర్ రాజును ఆహ్వానించినట్లు తెలిపారు. బీసీ ఉద్యమానికి అన్ని రాష్ట్రాల నుంచి మద్దతును కూడా కడతామని బీసీల డిమాండ్లను సాధించి తీరుతామని స్పష్టం చేశారు.




# టికెట్ల తనిఖీతో 22 రోజుల్లో రూ.10 కోట్లు

విజయవాడ, ఏప్రిల్ 25 విజయవాడ రైల్వే డివిజన్ ప్రయాణికులకు విధించే జరిమానాల ద్వారా భారీగా ఆదాయాన్ని సాధించింది. కేవలం 22 రోజుల్లో ఏకంగా రూ.10 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో జోనల్ స్థాయిలో ఇంత భారీ ఆదాయం రావడం సరికొత్త రికార్డ్ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందిని అధికారులు అభినందించారు.విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. ప్రయాణికులకు విధించే జరిమానాల (టికెట్స్ తనిఖీ) ద్వారా ఏప్రిల్ నెలలో 22 రోజుల్లో భారీగా ఆదాయం లభించింది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో టికెట్ల తనిఖీల ద్వారా 22 రోజుల వ్యవధిలో, రికార్డు స్థాయిలో రూ.10 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే జోనల్ స్థాయిలో ఇంత ఆదాయం రావడం ఒక రికార్డు అని అధికారులు చెబుతున్నారు. గతేడాది అక్టోబరులో నెలవారీ ఆదాయం రూ.8.59 కోట్ల ఆదాయం వచ్చింది.. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించారు. ఇది రికార్డ్ మాత్రమే కాదు ఆల్ టైమ్ రికార్డ్ అని చెబుతున్నారు.విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సీనియర్ డీసీఎం బి ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో రైల్వే తనిఖీ సిబ్బంది ప్రతి రోజూ రైళ్లు, స్టేషన్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా ప్రయాణికులు టికెట్లు లేకుండా ప్రయాణిస్తుంటే వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. అయితే విజయవాడ డివిజన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.76.34 కోట్లు ఆదాయం లభించింది. తనిఖీల ద్వారా భారీగా ఆదాయం సాధించినందుకు సీనియర్ డీసీఎం ప్రశాంత్ కుమార్, తనిఖీ సిబ్బందిని డీఆర్ఎం మోహిత్, అధికారులు అభినందించారు.రైల్వేశాఖ దేశవ్యాప్తంగా టికెట్ల తనిఖీ చేపడుతుంది.. టికెట్లు లేకుండా ప్రయాణించేవారికి జరిమానాలు విధిస్తుంటారు. ప్రయాణికుల దగ్గర టికెట్లను తనిఖీలు చేసేందుకు టీటీలు విధుల్లో ఉంటారు.. వీరు రైల్వే స్టేషన్లతో పాటుగా రైళ్లలో కూడా తనిఖీలు చేస్తుంటారు. కొంతమంది ప్రయాణికులు టికెట్లు లేకుండా ప్రయాణిస్తూ వీరికి అడ్డంగా దొరికిపోతారు. టికెట్ లేనివారికి రైల్వే చట్టంలోని 137, 138 సెక్షన్ల ప్రకారం జరిమానా విధిస్తున్నారు. అలాగే జరిమానాతో పాటు ఆ ప్రయాణికుడు ఎక్కిన స్టేషన్ నుంచి టీటీకి దొరికిపోయిన స్టేషన్ వరకు అయ్యే టికెట్ డబ్బులు కూడా వసూలు చేస్తారు. ఒకవేళ ప్రయాణికుడు జరిమానా చెల్లించడానికి నిరాకరిస్తే.. రైలు నుంచి దింపేస్తారు. అంతేకాదు రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందని రైల్వే చట్టాలు చెబుతున్నాయి.

## మండలిలో పట్టు కోసం ప్రణాళికలు

గుంటూరు, ఏప్రిల్ 25, వైయస్సార్ కాంగ్రెస్పార్టీకి చాలామంది నేతలు గుడ్ బై చెప్పారు. కొంతమంది అయితే వైసిపి ద్వారా వచ్చిన పదవులను సైతం వదులుకునేందుకు సిద్ధపడ్డారు. ఆ పదవులకు రాజీనామా చేశారు. కూటమి పార్టీలో చేరిపోయారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేసిన రాజీనామాను ఆమోదించారు కానీ.. పదవులకు రాజీనామా ఆమోదించడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. కూటమి పార్టీలో చేరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డిని వారు విమర్శిస్తున్నారు. అలాంటి వారిపై కచ్చితంగా చర్యలకు డిమాండ్ చేస్తారు. అనర్హత వేటు వేయాలని కోరుతారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పరిస్థితి లేదు. వ్యక్తిగతంగా రాజీనామా చేసినా ఆమోదించక.. బలవంతంగా ఆ పదవుల్లో ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్సీలు తమ పదవులకు రాజీనామా చేశారు. శాసనమండలి చైర్మన్ ఫార్మేట్లో తమ రాజీనామాలను సమర్పించారు. కానీ మండలి చైర్మన్ ఆమోదించకపోవడం వెనుక పెద్ద రాజకీయ కోణం ఉంది. సాంకేతికంగా వారు వైసిపి ఎమ్మెల్సీలు గానే కొనసాగాలని కోరుకుంటున్నారు. దీని వెనుక భారీ మాయాజాలం ఉంది. రాజీనామా చేసిన మరుక్షణం తమ బలం తగ్గిపోతుంది శాసనమండలిలో. ఆపై కూటమి బలం పెరిగిపోతుంది. చివరికి న్యాయస్థానాలు ఆదేశించినా శాసనమండలి చైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదే ఎమ్మెల్సీలతో రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యుల రాజీనామాలు ఆమోదం పొందాయి. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా జరిగిపోయిందిమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఆ బలంతో రాజకీయం చేయాలని చూస్తున్నారు

# ఎబివిపి 48 గంటల నిరసన దీక్ష విరమణ



హైద్రాబాద్ ఏప్రిల్ 25 ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తున్న ప్రభుత్వ కుట్రను తిప్పి కొట్టాలనే ఉద్దేశంతో సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పీజీ కాలేజీ లో 48 గంటల నిరసన దీక్ష రెండవరోజు విజయవంతంగా కొనసాగింది.

నిరసన దీక్ష తెలియజేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలపడానికి ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు డా:చీ జానారెడ్డి రావడం జరిగింది... ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ రాష్ట్రంలో 10,000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ బకాయులు పెండింగ్ లో ఉన్నాయని , ప్రతి సంవత్సరం రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులకు ఫీజు నెంబర్స్ మెంట్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని, దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి 2500 కోట్లు కేటాయిస్తే అనగా బడ్జెట్లో 0.77 శాతం నిధులు కేటాయిస్తే సరిపోతుందని, కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల ఆసక్తి కనపడుతూ లేదని , ఇవి విద్యార్థుల బిక్ష కాదు విద్యార్థుల హక్కు. అని ఇప్పటికైనా ప్రభుత్వం ముద్దు నిద్ర వేడి తక్షణం పెండింగ్ లో ఉన్న విద్యార్థుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ విద్యార్థి జీవితాలు మారడం లేదని, గౌరవ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులకు తగిన రీతిలో ప్రభుత్వం తరఫునుండి తగు రీతులు నివేదిక సమర్పించి ఈ యొక్క ఫీజు రీమార్స్మెంట్ పథకాన్ని కొనసాగించి తెలంగాణ విద్యార్థి సమాజానికి తగిన న్యాయం చేయాలని కోరారు.

సికింద్రాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పీజీ కళాశాలలో చేసిన 48 గంటల నిరసన దీక్షకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రావుల కృష్ణ తో కలిసి మద్దతు తెలిపిన అనంతరం దీక్షను విరమింపజేయడం జరిగింది...

# సింహాచలం చందనోత్సవంలో కనిపించని గంటా

విశాఖపట్టణం, ఏప్రిల్ 25 సీనియర్ మోస్ట్ లీడర్. ప్రతీ ఎన్నికలప్పుడు నియోజకవర్గం మార్చి పోటీ చేసి గెలవడం ఆయన స్టైల్. అలాంటి లీడర్ కొన్నాళ్లుగా సైకిల్ పార్టీలో సైలెంట్‌గా ఉండిపోతున్నారట. టచ్ మీ నాట్ అన్నట్లుగా ఉంటున్నారట. లేటెస్ట్‌గా ఆయన నియోజకవర్గ పరిధిలో జరిగిన..చందనోత్సవంలో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే కనిపించకపోవడం చర్చకు దారితీసింది.ఉత్తరాంధ్రలో మోస్ట్ పాపులర్ లీడర్ గంటా శ్రీనివాసరావు. 2014లో మంత్రిగా చక్రం తిప్పారు. ఆ తర్వాత 2019లో వైసీపీ వేవ్‌లోనూ గెలిచారు. 2024లో గెలిచాక అమాత్య యోగం దక్కకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు కొన్నాళ్లుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది చాలదన్నట్టు లేటెస్ట్‌గా సింహాచలంలోని శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామి ఆలయ చందనోత్సవంలో ఆయనెక్కడా కనిపించలేదు. గంటా నియోజకవర్గం అయిన భీమిలి పరిధిలోకే సింహాచలం వస్తోంది. ఏడాదికి ఒకసారి జరిగే అతిపెద్ద ఈ ఆధ్యాత్మిక వేడుకకు సీనియర్ టీడీపీ లీడర్, సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా దూరంగా ఉండటం..తన నియోజకవర్గ పరిధిలోనే జరిగినా అటువైపు కన్నెత్తి చూడకపోవడం చర్చకు దారితీస్తోంది.సింహాచల ఆలయ ఉత్సవాల బాధ్యతలను హోంమంత్రి అనితకు ఇచ్చింది సర్కార్. ఆమె అంతా తానై రివ్యూలు చేసి.. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే తన నియోజకవర్గంలో జరిగిన వేడుకకు సీనియర్ నేతనైన తనను కాదని..హోంమంత్రికి బాధ్యతలు అప్పగించడం గంటాకు నచ్చలేదనేది ఓ వర్గం వాదన. గతేడాది చందనోత్సవంలో గోడ కూలి అపశృతి జరగడం..ప్రభుత్వానికి కాస్త బ్యాడ్ నేమ్ రావడంతో ఈసారి జాగ్రత్తలు తీసుకుందట సర్కార్. అందుకే హోంమంత్రి అనితకు బాధ్యతలు అప్పగించారని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు.రెండు దశాబ్ధాలుగా రాజకీయాల్లో ఉన్నా సరే ఓటమి అంటే తెలియని నాయకుడు గంటా. అలాగే జిల్లాలో పోటీ చేసిన స్థానం నుంచి తిరిగి పోటీ చేయకుండా విజయ కేతాన్ని ఎగురవేయడం ఆయన స్టైల్. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, టీడీపీ ప్రభుత్వంలోనూ మంత్రిగా పని చేశారు. అలా ఉత్తరాంధ్రలో సీనియర్ మోస్ట్ లీడర్‌గా.. ఓటమెరుగని నేతగా ఉన్న ఆయనకు 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రి పదవి దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారన్న టాక్ నడిచింది. ప్రభుత్వంలో పదవి దక్కకపోయినా..పార్టీలో మంచి పొజిషన్ ఇస్తారని ఆశపడ్డ గంటాకు నిరాశే ఎదురైందట. అటు పొలిట్ బ్యూరో, ఇటు జాతీయ, రాష్ట్ర కమిటీల్లో ఆయనకు చోటు దక్కలేదు. పోనీ గంటాకు బదులుగా ఆయన కుమారుడు రవితేజకు అయినా సరే యూత్ కోటాలో ఛాన్స్ ఇచ్చారంటే అదీ లేదు. తండ్రీ కొడుకులిద్దరికీ టీడీపీ అధిష్టానం మొండి చేయి చూపింది. ఉత్తరాంధ్రలోని సీనియర్ లీడర్లకు లేదా, వారి వారసులకు పార్టీలోని ఏదో ఒక పొజిషన్ కట్టబెట్టారు. కానీ గంటాకు, ఆయన కుమారుడుకు పార్టీ పదవులు దక్కలేదు. తాను కోరుకున్న మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టడం, ఓ వైపు పార్టీ కమిటీల్లో స్థానం లేకుండా చేయడంతో గంటా డీప్‌గా హర్ట్ అయ్యారన్న గుసగుసలకు దారితీసింది. ఇక తన నియోజకవర్గంలో జరిగే చందనోత్సవ నిర్వహణ బాధ్యతలు పూర్తిగా హోంమంత్రికి అప్పగించడం కూడా తనను తగ్గించడమేనన్న ఫీలింగ్‌లో ఉన్నారట గంటా. అందుకే ఆయన చందనోత్సవం రోజు విశాఖలో లేకుండా..బిజీగా ఉండటం వల్లే రాలేదనే సంకేతాన్ని పంపే ప్రయత్నం చేశారట.మరోవైపు టీడీపీ అధిష్టానం పెద్దలు గంటాను పూర్తిస్థాయిలో తమవాడిగా నమ్మడం లేదన్నది తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్న మాట. చంద్రబాబు అరెస్ట్ అప్పుడు..ఆ తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం..హైకమాండ్ పెద్దలు ఫోన్ చేసినా లైట్ తీసుకోవడం వంటివి టీడీపీ అధిష్టానంతో గంటాకు గ్యాప్ ఏర్పడటానికి కారణమయ్యాయని అంటున్నారు. అందుకే ఇప్పుడు పవర్‌లోకి వచ్చినా ఆయనకు పెద్దపీట దక్కట్లేదని ఓపెన్ సీక్రెట్ అంటున్నారు విశాఖ టీడీపీ నేతలు.

## ఇనామ్ భూములపై క్లారిటీ

విజయవాడ, ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇనామ్ భూములక సంబంధించి మరో మెమో జారీ చేసింది. మతపరమైన ఇనామ్‌లకు మినహాయింపు వర్తించదని క్లారిటీ ఇచ్చింది. మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు మినహాయింపు వర్తించదని తెలిపింది. ఈ మేరకు సీఎస్ సాయిప్రసాద్ ప్రత్యేకంగా మరో మెమో జారీచేశారు. మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూముల అంశంపై క్లారిటీ ఇచ్చారు.. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇనామ్ భూములకు విముక్తి కల్పించిన సంగతి తెలిసిందే. విలేజ్ సర్వీసు ఇనాం భూములకు నిషేధిత జాబితా నుంచి తొలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం లక్షా 36వేల24 ఎకరాల భూములకు రిజిస్ట్రేషన్లపై ఉన్న నిషేధం ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో సర్వీసు ఇనామ్ భూములకు విముక్తి కల్పించారు. తాజాగా ఇనామ్ భూములకు సంబంధించి ప్రభుత్వం మరో ముఖ్యమైన స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో మతపరమైన ఇనామ్ భూములకు ఈ మినహాయింపు వర్తించదని మరో మెమో విడుదల చేశారు.రాష్ట్రంలో ఇటీవల ఇచ్చిన మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ అనుమతులు మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు వర్తించదని సీఎస్ సాయిప్రసాద్ మరో మెమో ద్వారా క్లారిటీ ఇచ్చారు. మతపరమైన, దేవాదాయ, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు సంబంధించి నిబంధన ఉంటుంది. ఏపీ ఇనామ్స్ చట్టం-1956ను బట్టి.. ఈ ఇనామ్‌లు మతపరమైన సంస్థలకు సేవ చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ భూముల సాగుదారులు వారి జీవనోపాది కోసం భూమిని సాగు చేసుకుంటూనే సేవలు అందించాలి. గ్రామ పనివారు.. అలాగే గ్రామ సర్వీస్ ఇనామ్‌లు గ్రామంలో వృత్తి పనివారికి, సమాజానికి సేవ చేసినందుకు కేటాయించినవని గుర్తు చేశారు. వీరు దైవ సేవ చేయాల్సిన నిబంధన లేదని.. ఈ భూములు ఏపీ ఇనామ్స్ చట్టం-1956 పరిధిలోకి రావని కూడా పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ నెల 17న ఇచ్చిన మెమో గ్రామ పనివారు, గ్రామ సర్వీస్ ఇనామ్‌లకే వర్తిస్తుందన్నారు. మతపరమైన, సంస్థాగత సర్వీస్ ఇనామ్ భూములకు వర్తించదని క్లారిటీ ఇచ్చారు.పూర్వకాలంలో రాజులు, పాలకులు ఆలయాలు, మసీదుల కోసం.. మతపరమైన సేవలు అందించేవారి కోసం ఇచ్చిన భూముల్ని.. మతపరమైన ఇనామ్ భూములు అంటారు. గతంలో ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు, ఆలయాల మరమ్మతుల పనులు, అర్చకులతో పాటు సేవలు అందించినవారి జీవనోపాధి కోసం ఈ భూముల్ని కేటాయించారు. ఈ భూములు సాగు చేసుకునేవారికి వచ్చే ఆదాయాన్ని జీవనోపాధికి ఉపయోగించుకుంటూనే మతపరమైన సేవలు కూడా అందిందించాలి. సాధారణ ఇనామ్ భూములలాగా వీటిని విక్రయించడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదు.. కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన మినహాయింపులు కేవలం గ్రామ సేవా ఇనామ్‌లకే వర్తిస్తాయని స్పష్టత ఇచ్చారు. ఈ మినహాయింపులు మతపరమైన, దేవాదాయ ఇనామ్‌లకు వర్తించవని తేల్చి చెప్పారు. మొత్తం మీద ఏపీ ప్రభుత్వం మతపరమైన ఇనామ్‌లపై స్పష్టతనిస్తూ తాజాగా మరో మెమోను జారీ చేసింది.. ఈ భూముల విషయంలో ఎలాంటి కన్ఫ్యూజ్ లేకుండా క్లారిటీ ఇచ్చారు.

# మళ్లీ అసెంబ్లీ సమావేశాలు

విజయవాడ, ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలను రాబోయే 10 రోజుల్లో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. అమరావతి వేదికగా జరిగిన టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , కీలక నేతలతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రాష్ట్ర ప్రయోజనాలతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు, దానిపై ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై చర్చలు నిర్వహించే అవకాశం ఉంది. మహిళా బిల్లుకు సంబంధించి కాంగ్రెస్ మినహా మిగిలిన అన్ని పక్షాలు సానుకూలత వ్యక్తం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం, విపక్షాలు చేసిన ద్రోహంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం , కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. ఇందులో టీడీపీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ తరఫున పీవీఎన్ మాధవ్, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ కార్యక్రమాలను రూపొందించనున్నారు.ప్రతి ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రెస్ మీట్లు ఏర్పాటు చేసి, మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రాముఖ్యతను, కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని చంద్రబాబు ఆదేశించారు. దీనికి తోడు, రాబోయే రోజుల్లో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో భారీ బహిరంగ సభలను నిర్వహించాలని టెలి కాన్ఫరెన్స్‌లో నిర్ణయించారు. ఈ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కాకుండా, ప్రభుత్వ లక్ష్యాలను స్పష్టంగా వివరించనున్నారు.అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కోరారు. టీడీపీ, జనసేన, మరియు బీజేపీ నేతలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా మహిళా సాధికారత దిశగా తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజల మద్దతు కూడగట్టాలని సూచించారు. 10 రోజుల్లో ప్రారంభం కానున్న ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# కనిపించని కోటరీ

కడప, ఏప్రిల్ 25 వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన పై వస్తున్న విమర్శలకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా కోటరీ విషయంలో జగన్ కొంత దిగి వచ్చినట్లు కనపడుతుంది. అందుకు ఉదాహరణ ఇటీవల జరిగిన వైసీపీ ఆవిర్భావ వేడుకలే కారణమంటున్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కొత్త చర్చకు దారి తీశాయి. గత ఐదేళ్లుగా పార్టీలో, ప్రభుత్వంలో అన్నీ తానై వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి ఈ వేడుకల్లో ఎక్కడా కనిపించకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం అంటే జగన్ పక్కనే ఉండి ప్రోటోకాల్ చూసుకునే సజ్జల, ఈసారి కనీసం ఫోటోల్లో కూడా లేకపోవడం పార్టీ కేడర్‌లో రకరకాల సందేహాలకు కారణమయింది.గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డికి నీడగా సజ్జల పేరు మారుమోగిపోయింది. పార్టీలో ఏ చిన్న నిర్ణయం తీసుకోవాలన్నా సజ్జల కనుసన్నల్లోనే జరిగేది. అయితే, గత ఎన్నికల్లో వైసీపీ చవిచూసిన ఘోర పరాజయానికి సజ్జల అనుసరించిన వ్యూహాలే కారణమని పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. క్షేత్రస్థాయి కార్యకర్తల నుంచి సీనియర్ నేతల వరకు చాలామంది సజ్జల వైఖరి వల్లే పార్టీకి ఈ గతి పట్టిందని బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే జగన్ ఆయనను కావాలనే పక్కన పెట్టారా..? అన్న చర్చ మొదలైంది. అయితే ఇందుకు స్పష్టమైన సంకేతాలు మాత్రం ఇంకా కనిపించడం లేదు. సజ్జల అప్పుడప్పుడు వచ్చి మీడియా ముందు మాట్లాడుతున్నప్పటికీ జగన్ పెద్దగా దరి చేరనివ్వడం లేదంటున్నారు. వైసీపీని వీడిపోయిన నేతలందరూ తమను జగన్ ను కలవకుండా కొందరు అడ్డుకుంటున్నారని, జగన్ తో తమ సమస్యలను చెప్పుకునేందుకు కూడా ఐదేళ్లు పార్టీలో అధికారంలో ఉన్న సమయంలో వీలు కాలేదు. అయితే ఇందులో సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే కాదు.. నాడు సీఎంవోలో ఉన్న అధికారులు సయితం పెత్తనం చేసే స్థాయికి వచ్చారంటే అది జగన్ కు తెలిసి జరిగిందా? తెలియకుండా జరిగిందా? అన్నది తెలియకపోయినా డ్యామేజీ మాత్రం భారీగానే జరిగింది. అయితే తాజా పరిణామాలు చూస్తుంటే జగన్ తన నీడలను పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కొత్త టీం భవిష్యత్ లో కనిపిస్తుందని పార్టీ నేతలు అంటున్నారు. మరి ఇందులో నిజమెంతో తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

### ఆత్మగౌరవం, ఆర్థిక వనరు

ఎలాగైనా పూర్వ వైభవం సాధించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. కూటమి దూకుడు చూస్తుంటే అది సాధ్యమయ్యే పని కాదు అని తెలుస్తోంది. ఈ తరుణంలో కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో ప్రాంతీయ విద్వేషాలను రగిలించేందుకు కూడా వెనుకడుగు వేయడం లేదని కూటమి ఆరోపిస్తోంది. ఏ రాయలసీమ ను అడ్డం చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందో.. అదే ప్రాంతాన్ని ఎటువంటి అభివృద్ధి చేయలేదు ఆ పార్టీ. ప్రధానంగా సాగునీరు, పారిశ్రామిక అభివృద్ధి వంటి కీలక రంగాల్లో చేసిందేమీ లేదు. కానీ ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే రాయలసీమ ప్రయోజనాల పేరిట కొత్త నాటకం ప్రారంభించింది ఆ పార్టీ. అమరావతి పై విషం చిమ్ముతూ.. డబ్బునంత అక్కడే ఖర్చు పెడుతున్నారంటూ సీమ ప్రజలలో వ్యతిరేక భావన వచ్చేలా ప్రయత్నిస్తోంది.మూడు రాజధానులు అన్నది వైయస్సార్ కాంగ్రెస్. అప్పట్లో న్యాయ రాజధాని పేరుతో కర్నూలుకు ఒక హైకోర్టు ప్రతిపాదన చేసింది. ఇప్పుడేమో మావిగన్ అంటూ అమరావతి పక్కనే నగరాలను కలుపుతూ రాజధాని చేయాలని చూస్తోంది. మరోవైపు రాయలసీమకు అన్యాయం జరుగుతోందంటూ కొత్త నినాదాలు అందుకుంది. ఐదేళ్ల లో రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కానీ.. ఉపాధి కల్పనలో కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. హంద్రీ నీవా, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసింది. ఇప్పుడు రాయలసీమ ప్రయోజనాల పేరుతో అక్కడి ప్రజల్లో ఒక రకమైన వ్యతిరేక భావన ప్రభుత్వం పై వచ్చేలా పన్నాగం పన్నుతోంది.అమరావతి పై విషం చిమ్మడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆపడం లేదు. దానిని రాయలసీమలో మూడు పెడుతూ ప్రచారం చేస్తోంది. కానీ అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆర్థిక వనరు కూడా. అక్కడ సృష్టించే ప్రతి రూపాయి, సంపద రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి దోహదం చేయనుంది. సమాజంతో పాటు పరిస్థితులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికి ఇది తెలిసిందే. ఇప్పటికే రాష్ట్ర విభజన జరిగి రెండు రాష్ట్రాలు ఎంతలా నష్టపోయాయి తెలియంది కాదు. ఇప్పుడు ప్రత్యేక ప్రాంతం నినాదాన్ని ప్రజలు లెక్క చేసే స్థితిలో లేరు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు కూడా వర్కౌట్ కావు.

# మే 25 నుంచే వానలు

హైదరాబాద్, ఏప్రిల్ 25, ఈ సామి మార్చి మొదటి నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, భారత దేశంలోని చాలా ప్రాంతాలు తీవ్రమైన ఎండలతో జనాలు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 43-44 డిగ్రీలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలోనే దేశ ప్రజలకు మరో చల్లని శుభవార్త కూడా చెప్పింది. గతంతో పోల్చుకుంటే ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే దేశాన్ని చేరుకుంటాయిన తెలిపింది.యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్ అంచనాల ప్రకారం, ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే పలకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మే చివరి నాటికే దక్షిణ భారతదేశంలో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. మే 18 నుండి 25 మధ్య నైరుతి రుతుపవనాలు అండమాన్ మరియు నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో సాధారణం కంటే 30 నుండి 60 మి.మీ ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయిని స్పష్టం చేశాయి.ఇక మే 25 నుండి జూన్ 1 మధ్య ఈ రుతుపవనాలు పశ్చిమ దిశగా కదిలి కేరళ తీరాన్ని, తమిళనాడులోని దక్షిణ జిల్లాలను తాకవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల ప్రభావంతో అండమాన్ ఉత్తర ప్రాంతంలో ఒక ఉష్ణమండల వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉందని.. దీని కారణంగా రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదులుతాయని స్పష్టం చేసింది.గతేడాదిలో కూడా రుతుపవనాలు అంచనా వేసిన దానికంటే ముందే కేరళ తీరాన్ని తాకాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమైతే, మే 25 నాటికే రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే, ఎండలతో అల్లాడుతున్న కోట్లాది మంది ప్రజలకు ఉపశమనం లభించడమే కాకుండా, వ్యవసాయ పనులు కూడా త్వరగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## జూన్ నెలలోనే పెద్ది...

హైదరాబాద్, ఏప్రిల్ 25, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేం బుచ్చిబాబు కాంబోలో రాబోతోన్న విలేజ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ నెల 30న రిలీజ్ కావాల్సిన మూవీ అనుకోని కారణాలతో జూన్‌కు వాయిదా పడింది. రిలీజ్ డేట్‌పై లేటెస్ట్ బజ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మొదటి నుంచి పెద్ది జూన్ ఫస్ట్ వీక్ కానీ లాస్ట్ వీక్ కానీ రిలీజ్ కావొచ్చంటూ ప్రచారం సాగింది. అయితే, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పెండింగ్ దృష్ట్యా జూన్ 4న వచ్చే ఛాన్స్ లేదని... జూన్ 25న విడుదల కానుందని తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందట. అంతే కాకుండా 24న రాత్రి నుంచే ప్రీమియర్స్ కూడా పడే అవకాశం ఉందని ఇన్ సైడ్ వర్గాల టాక్. వీటిపై త్వరలోనే క్లారిటీ రానుంది.ఈ మూవీలో స్పెషల్ సాంగ్ షూట్ మినహా మిగిలిన పార్ట్ కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. రీసెంట్‌గానే షూటింగ్ అప్డేట్‌ను షేర్ చేసుకున్నారు డైరెక్టర్ బుచ్చిబాబు. చరణ్‌తో ఫోటోను షేర్ చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఈక్వెల్‌గానే జరుగుతున్నట్లు చెప్పారు. పెద్దిలో స్పెషల్ సాంగ్‌లో హీరోయిన్ శ్రుతి హాసన్ కన్ఫర్మ్ అయినట్లు తెలుస్తోంది. గతంలో పూ?జ హెగ్డే, మృణాల్ ఠాకూర్, మానస వారణాసి, సంయుక్త మీనన్ పేర్లు వినిపించినా స్టార్ హీరోయిన్ శ్రుతినే ఈ సాంగ్ కోసం సెలక్ట్ చేశారట. అయితే, అఫీషియల్‌గా దీనిపై ఎలాంటి అనౌన్స్‌మెంట్ రాలేదు. గతంలో ఆమె మహేశ్ బాబు ఆగడు మూవీలో చేసిన స్పెషల్ సాంగ్ భారీగా ట్రెండ్ అయ్యింది. ఇప్పుడు చరణ్‌తో కలిసి శ్రుతి స్టెప్పులు వేయనున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటే హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా స్టెప్పులు వేయనున్నారట.బాలీవుడ్‌లోనూ శ్రుతి హాసన్ పలు స్పెషల్ సాంగ్స్ చేయగా ట్రెండ్ అయ్యాయి. దాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ డ్యాన్స్ నెంబర్‌కు ఆమెను సెలక్ట్ చేసినట్లు తెలుస్తోంది. స్పెషల్ సాంగ్ షూట్ కంప్లీట్ అయిన వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులపై పూర్తి స్థాయిలో ఫోకస్ చేయనున్నారు.ఈ మూవీలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా... కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, మిర్జాపూర్ ఫేం దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ, జగపతి బాబు, సాయి కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

## రేగోడు మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న మంత్రి




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, ఆందోల్ నియోజకవర్గం రేగోడు మండల కేంద్రంలోని, ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి, ఆరాధన మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, దేవాలయంలో ఆలయ పూజారులు మంత్రికి పూర్ణ కుంభ, స్వాగతం పలికారు, మంత్రిస్వామివారినిదర్శించుకున్నారు, అనంతరం మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పిసిసి వైస్ ప్రెసిడెంట్ మున్నూరు కిషన్, డాక్టర్స్ సెల్ చైర్మన్ డా, రాజీవ్, మండల



కాంగ్రెస్ అధ్యక్షుడు, దిగంబరావ్, భాస్కర్ రెడ్డి, మరెల్లి సంగమేశ్వర్, గ్రామ సర్పంచ్, పర్వీన్ చోటు మియా, స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు..

# రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి రీ ఎంట్రీ



హైదరాబాద్, ఏప్రిల్ 25,రాజకీయాల్లోకి రీఎంట్రీపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. మళ్లీ రాజకీయాల్లోకి వస్తానన్న విజయసాయిరెడ్డి.. జులైలో పొలిటికల్ రీఎంట్రీ ఉంటుందని తెలిపారు. అలాగే మీడియా రంగంలోకి కూడా వస్తానని మరోసారి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి.. ఆ పార్టీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైనప్పటికీ.. రాజకీయ రంగాన్ని మాత్రం పూర్తిగా విడిచిపెట్టలేదు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత కొన్ని రోజుల పాటు సైలెంట్‌గా ఉన్న విజయసాయిరెడ్డి.. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా వివిధ రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే తన పొలిటికల్ రీఎంట్రీపై విజయసాయిరెడ్డి క్లారిటీ ఇచ్చారు. జులై నెలలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. మీడియా రంగంలోకి కూడా ప్రవేశించనున్నట్లు విజయసాయిరెడ్డి మరోసారి స్పష్టం చేశారు.ఇదే క్రమంలో వైసీపీపై విమర్శలు చేశారు విజయసాయిరెడ్డి. గత ఎన్నికల్లో ఓడించి.. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న విజయసాయిరెడ్డి.. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు తమ పద్ధతి మార్చుకుని, ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత పలువురు నేతలు ఆ పార్టీని వీడారు. ఈ క్రమంలోనే 2025 జనవరి నెలలో వైసీపీ పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, తన పదవికి న్యాయం చేయలేక రాజీనామా చేస్తున్నట్లు అప్పట్లో విజయసాయిరెడ్డి ప్రకటించారు. విజయసాయిరెడ్డి రాజీనామాకు ఆ వెంటనే రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం కూడా లభించింది.ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా వివిధ అంశాలపై స్పందిస్తూ వస్తున్న విజయసాయిరెడ్డి.. ఇటీవలే మీడియా రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే తెలుగు, హిందీ, ఇంగ్లీషులో డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్ ప్రారంభిస్తామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువత, రైతాంగం, కార్మికులకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజా గొంతుకగా మారతామని పేర్కొన్నారు. ఏ పొలిటికల్ పార్టీకి అనుబంధంగా తాము పనిచేయమని.. డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించిన తర్వాత తెలుగులో శాటిలైట్ ఛానెల్ కూడా తెస్తామని పేర్కొన్నారు. త్వరలోనే వీటి పేర్లు ప్రకటిస్తామంటూ విజయసాయిరెడ్డి ఇటీవల ట్వీట్ చేయటం ప్రాధాన్యం సంతరించుకుంది. విజయసాయిరెడ్డి. ఏపీ లిక్కర్ కేసులో విజయసాయిరెడ్డి నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాలలో ఏమీ లభించలేదని విజయసాయిరెడ్డి వెల్లడించారు. ఈ క్రమంలోనే రాజకీయ విషయాలపై మాట్లాడిన విజయసాయిరెడ్డి జూలైలో రాజకీయాల్లోకి మళ్లీ వస్తానని ప్రకటించారు. అలాగే ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరముందని వ్యాఖ్యనించటంతో విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ పెడతారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి

# సీబీఎస్సీలో సైన్స్ బెటర్ మెంట్ కే ఎక్కువ

హైదరాబాద్, ఏప్రిల్ 25, మే 15 నుంచి 21 వరకు జరగనున్న సీబీఎస్సీ సెకండ్ బోర్డు పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల కోసం మొత్తం 6,68,854 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా 4.74 లక్షల మంది విద్యార్థులు కేవలం సైన్స్ సబ్జెక్టులోనే మార్కుల ఇంప్రూవ్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సీబీఎస్సీ వెల్లడించింది. ఇక వీరిలో 5,25,655 మంది ఇంప్రూవ్‌మెంట్ కేటగిరీకి, 85,285 మంది కంపార్ట్‌మెంట్ కేటగిరీ కింద, 57,914 మంది కంపార్ట్‌మెంట్ ఢ ఇంప్రూవ్‌మెంట్ రెండు కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో బాలురు 4,02,643 మంది, బాలికలు 2,66,209 మంది ఉన్నారు.కాగా అబాఇ 2026 నుంచి 10వ తరగతి బోర్డు పరీక్షల కోసం రెండు-ఎడిషన్ల విధానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం విద్యార్థులందరూ తప్పనిసరిగా ప్రధాన పరీక్షలకు హాజరు కావల్సి ఉంటుంది. అయితే సెకండ్ బోర్డు పరీక్షలకు కంపార్ట్‌మెంట్ కేటగిరీలో ఉన్నవారికి, మెరుగుదల కోరుకునే వారికి మాత్రమే అవకాశం ఉంటుంది. రెండు పరీక్షలలోనూ వచ్చిన అత్యుత్తమ మార్కులను బోర్డు జారీ చేసే మార్క్ షీట్-కమ్-సర్టిఫికేట్‌లో పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు అందిస్తారు.సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తెలిపిన ప్రకారం.. సెకండ్ బోర్డు పరీక్షలు 2026 మే 15వ తేదీ నుండి ప్రారంభమై, 2026 మే 21వ తేదీ వరకు జరుగుతాయి. పరీక్షల తేదీల షెడ్యూల్‌ను ఇప్పటికే బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు సైన్స్, మ్యాథ్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజెస్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టుల్లో ఇంప్రూవ్‌మెంట్ రాసే అవకాశాన్ని బోర్డు కల్పించింది. ఇక రెండో విడత ఫలితాలు జూన్ నెలాఖరు నాటికి విడుదలవనున్నాయి.

# కొత్త డీజీపీగా సీవీ ఆనంద్?

హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణకు కొత్త పోలీస్ బాస్ రానున్నారు. తదుపరి డీజీపీగా 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ చేయనుండటంతో.. యూపీఎస్సీ పంపిన ముగ్గురు సీనియర్ల జాబితాలో అత్యంత సీనియర్ అయిన ఆనంద్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. హోంశాఖలో ఇటీవల జరిగిన ఐపీఎస్ బదిలీలు కూడా ఈ మార్పును ధృవీకరిస్తున్నాయి. ఈ నెలాఖరులోగా దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.తెలంగాణకు కొత్త డీజీపీ రానున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌ను తదుపరి డీజీపీగా నియమించేందుకు ప్రభుత్వం దాదాపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో.. కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే ముగ్గురు అర్హులైన అధికారుల పేర్లతో కూడిన జాబితాను రాష్ట్రానికి పంపింది.యూపీఎస్సీ పంపిన ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రా పేర్లు ఉన్నాయి. అయితే ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ కావడం, క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల నిర్వహణలో ఆయనకు ఉన్న అపార అనుభవం ఆయనకు కలిసి వచ్చే అంశాలు. ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆనంద్.. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా సీవీ ఆనంద్ డీజీపీ అవుతారనే ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆనంద్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి.. ఆ స్థానాన్ని శిఖాగోయెల్‌కు అప్పగించారు. ఇది ఆయనను డీజీపీ పదవికి కేటాయించడానికేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు సీనియారిటీ, మరోవైపు ప్రభుత్వ నమ్మకాన్ని గెలుచుకున్న అధికారి కావడంతో సీవీ ఆనంద్ పేరు దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీకాలం ముగిసేలోగా.. అంటే ఈ నెలాఖరులోపు కొత్త డీజీపీ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆమోదం లభించిన వెంటనే హోంశాఖ జీవో విడుదల చేయనుంది. ఇక తెలంగాణలో పలువురు సీనియర్ ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

1994 బ్యాచ్‌కు చెందిన శిఖాగోయెల్‌ను హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్‌గానూ కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న 2004 బ్యాచ్ ఐపీఎస్ డా.తరుణ్‌జోషిని ఫ్యూచర్‌సిటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) ఐజీపీగా ఉన్న 2006 బ్యాచ్ ఐపీఎస్ సుమతిని మల్కాజిగిరి కమిషనర్‌గా నియమించారు.

# డిస్టెన్స్ మోడ్ లో డిగ్రీ...
# సర్కారీ ఉద్యోగాలకు రెడ్ సిగ్నల్

హైదరాబాద్, ఏప్రిల్ 25, దూరవిద్యా విధానంలో డిగ్రీలు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఇతర రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు తమ రాష్ట్ర సరిహద్దులు దాటి నిర్వహిస్తున్న స్టడీ సెంటర్ల ద్వారా పొందే డిగ్రీలు ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరావని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022లో విడుదల చేసిన లైబ్రేరియన్ పోస్టుల నోటిఫికేషన్ ఈ వివాదానికి మూలమైంది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు అభ్యర్థులు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ పూర్తి చేశారు. అయితే వీరు ఈ డిగ్రీని ఏపీలో కాకుండా తెలంగాణలో ఉన్న ఆ వర్సిటీ స్టడీ సెంటర్ల ద్వారా దూరవిద్యా విధానంలో పొందారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో వీరి డిగ్రీలు చెల్లవని టీజీపీఎస్సీ తిరస్కరించడంతో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో ఇదే తరహా డిగ్రీలతో కొందరికి ఉద్యోగాలు వచ్చాయని వారు వాదించారు.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక రాష్ట్ర చట్టం కింద ఏర్పడిన విశ్వవిద్యాలయం తన కార్యకలాపాలను ఆ రాష్ట్ర సరిహద్దులకే పరిమితం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు పెట్టి డిగ్రీలు ఇవ్వడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. 2013లో యూజీసీ జారీ చేసిన పబ్లిక్ నోటీసు ప్రకారం.. ఏ వర్సిటీ కూడా తన ప్రాదేశిక అధికార పరిధిని దాటి వెళ్లకూడదు. తెలంగాణలో ఏపీ వర్సిటీ సెంటర్లు నిర్వహించడం చట్టవిరుద్ధమని కోర్టు తెలిపింది. 2017 నియామకాల్లో ఇలాంటి డిగ్రీలను అంగీకరించారు కదా అని అభ్యర్థులు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. “గతంలో జరిగిన అవకతవకలు లేదా తప్పులను.. కొత్త తప్పులకు సమర్థనగా వాడలేము” అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలు స్టడీ సెంటర్ల నిర్వహణకు అనుమతిస్తాయన్న వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.ఈ తీర్పు కేవలం లైబ్రేరియన్ పోస్టులకే పరిమితం కాకుండా రాబోయే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలో ఉంటూ పక్క రాష్ట్రాల వర్సిటీల (ఉదాహరణకు ఆచార్య నాగార్జున, అన్నామలై, మదురై కామరాజ్ వంటివి) స్టడీ సెంటర్ల ద్వారా డిగ్రీలు పొందిన వారు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు.

# భూముల విలువల సవరణ

హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మే మొదటి వారం నుంచి సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘం దీనిపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య చైనా తరహా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు ‘హిల్ట్’ విధానం ద్వారా పారదర్శక పద్ధతిలో భూ వినియోగ మార్పిడి చేపడతామని స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల సూచనల మేరకు రాయితీలు, కొత్త జోన్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది.తెలంగాణలో ఆదాయ వనరుల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం దూకుడు పెంచింది. మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురావాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ‘ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం’ ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు పారిశ్రామిక ఎస్టేట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తూనే.. భూ విలువల సవరణ ద్వారా ఖజానాకు అదనపు ఆదాయాన్ని చేకూర్చడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామిక రంగానికి సంబంధించి అనేక వినూత్న ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాలను చైనా తరహాలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరగా.. ప్రభుత్వం దానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎటువంటి నగదు బదిలీలకు తావులేకుండా అమలు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పరిశ్రమల వల్ల కాలుష్యం ఉండకూడదని అదే సమయంలో అవి లాభసాటిగా నడవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అయితే హిల్ట్ పాలసీపై రాజకీయంగా తలెత్తుతున్న కొన్ని విమర్శలను పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు కొట్టిపారేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని కొందరు నేతలు భయపెట్టే ప్రయత్నం చేశారని కానీ పారదర్శకమైన ఈ విధానంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని తాము భావిస్తున్నట్లు తెలిపారు. భూ వినియోగ మార్పిడి ఛార్జీలను రోడ్డు విస్తీర్ణాన్ని బట్టి 30 శాతం నుంచి 50 శాతం వరకు నిర్ణయించారని అయితే వీటిని స్వల్పంగా తగ్గించాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేశారు. రాయితీలు ఇవ్వకపోయినా సరే పరిశ్రమల స్థాపనకు తగినంత భూమిని కేటాయించాలని వారు కోరారు.మరోవైపు, రాష్ట్రంలోని అన్ని శాఖల పరిధిలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణకు గురైన ప్రాంతాలు, ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న స్థలాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో పారిశ్రామిక రూపురేఖలను మార్చడమే కాకుండా.. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉంది.

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంట్లో ముగిసిన ఈడీ సోదాలు

తిరుపతి వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు ముగిసాయి. సుమారు 8 గంటల పాటు సోదాలు కొనసాగాయి.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడూ ఈడీ అదికారులకు పూర్తిగా సహకరించాం. అడిగిన ప్రతి డాక్యుమెంట్ అందజేశామని అన్నారు. ఎప్పుడు లిక్కర్ లో సంపాదించింది ఏమి లేదు . మా కుటుంబానికి సెంటిమెంట్ . నాన్నకు 10 ఏళ్లుగా లిక్కర్ పంచే అలవాటు కూడా లేదు . ఈడీ పైనా, న్యాయ వ్యవస్థ పైన నమ్మకం ఉంది. న్యాయం జరుగుతుందని భావిస్తున్నానని అన్నారు.

# సెంటిమెంట్ మళ్లీ పురుడుపోసుకుంటుందా?

## కవిత పార్టీకి స్పేస్ ఉందా

హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అంకం మొదలైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి మూడు బలమైన శక్తులు ఉన్న చోట.. నాలుగో శక్తి గా కవిత ఏ మేరకు రాణిస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం త్రిముఖ పోటీ నెలకొంది. అధికారం కోల్పోయినా కేడర్ బలంగా ఉన్న బీఆర్ఎస్, అధికారంలో ఉన్న కాంగ్రెస్, పుంజుకుంటున్న బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం నడుస్తోంది. ఈ దశలో కవిత కొత్త పార్టీని ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయంగానే కనిపిస్తోంది. అయితే, తెలంగాణ రాజకీయాల్లో స్పేస్ ఎప్పుడూ ఉంటుంది. ముఖ్యంగా సెంటిమెంట్, ప్రాంతీయ ఆకాంక్షలు బలంగా ఉన్న గడ్డపై, గొంతు లేని వర్గాలకు , అసంతృప్త నేతలకు కవిత పార్టీ ఒక వేదికగా మారే అవకాశం ఉంది. ప్రత్యేకించి మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతిని అజెండాగా మార్చుకుంటే కొంత మేర ఓటు బ్యాంకును ఆకర్షించవచ్చు.కవిత నిర్ణయం అన్నిటికంటే ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీనే ప్రభావితం చేయనుంది. కేసీఆర్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న నేతలు లేదా పార్టీలో ప్రాధాన్యత దక్కని సెకండ్ లైన్ లీడర్లు కవిత వైపు చూసే అవకాశం ఉంది. పార్టీ పేరులో తెలంగాణ ఉంటుంది. ఇది బీఆర్ఎస్ ఓటు బ్యాంకును చీల్చితే, అది పరోక్షంగా కాంగ్రెస్ , బీజేపీకి లాభం చేకూర్చవచ్చు. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఆమె తీసుకుంటున్న ఈ అడుగు, తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలకవచ్చు. కవిత తన తాజా వ్యాఖ్యల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. తెలంగాణలో జనాభా పరంగా పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గాలను తన వైపు తిప్పుకోవడం ద్వారా బలమైన పునాది వేయాలని ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీలు కూడా బీసీ మంత్రాన్ని జపిస్తున్న తరుణంలో, కవిత తెలంగాణ బిడ్డ గా వారి ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తారనేది కీలకం. ఆమె పార్టీలో చేరబోతున్న మేధావులు, ఉద్యమకారుల జాబితాను బట్టి ఈ పార్టీ గమ్యం దిశానిర్దేశం అవుతుంది.తెలంగాణ జాగృతి ద్వారా దశాబ్ద కాలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవితకు క్షేత్రస్థాయిలో ఒక నెట్‌వర్క్ ఉంది. ఉద్యమ సమయంలో పనిచేసిన వారు, ప్రస్తుతం రాజకీయంగా అవకాశాలు లేని వారు ఆమె వెంట నడిచే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె బలమైన అభ్యర్థులను నిలబెట్టి, ఒక పది నుంచి పదిహేను శాతం ఓట్లు సాధించగలిగితే.. రాష్ట్రంలో ఏ పార్టీ అయినా ప్రభుత్వ ఏర్పాటుకు ఆమె మద్దతు కోరాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే కింగ్ మేకర్ గా ఎదిగే అవకాశం ఆమెకు ఉంటుంది తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు త్రిముఖ పోటీ నుంచి చతుర్ముఖ పోటీ వైపు మళుతున్నాయి. ఈ మార్పు తెలంగాణ ఓటరు నాడిని ఎలా మారుస్తుందో వేచి చూడాలి. ముఖ్యంగా మహిళా నేత నేతృత్వంలో వస్తున్న మొదటి ప్రాంతీయ పార్టీగా ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుందో త్వరలోనే క్లారిటీ వస్తుంది.

### టార్గెట్ క్లియర్

సాధారణంగా కొత్త పార్టీలు అధికార పార్టీని విమర్శించడం ద్వారా ఉనికిని చాటుకుంటాయి. కానీ కవిత మాత్రం అధికార కాంగ్రెస్‌ను , దూకుడుగా ఉన్న బీజేపీని కాకుండా, బీఆర్ఎస్ మీదనే ఎక్కువ దృష్టి సారించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు సిద్ధాంతపరంగా ఆమె వైపు వచ్చే అవకాశం లేదని, అలాగే బీజేపీ హిందూత్వ ఓటు బ్యాంకు తన దరి చేరదని ఆమెకు బాగా తెలుసు. అందుకే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును, ఆ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న శ్రేణులను తన వైపు తిప్పుకోవడమే ఆమె సింగిల్ పాయింట్ అజెండా గా కనిపిస్తోంది.బీఆర్ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కవిత ఎంట్రీ ఆ పార్టీకి పెనుగండంగా మారేలా ఉంది. బీఆర్ఎస్ వైఫల్యాలను, ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని ఆమె పదే పదే ప్రస్తావిస్తుండటం యాదృచ్ఛికం కాదు. రేజరగబోయే ఆవిర్భావ సభలో కూడా ఆమె ప్రసంగం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాగే అవకాశం ఉంది. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, తెలంగాణ ఆకాంక్షలను మోసే స్వతంత్ర గళంగా తనను తాను ఆవిష్కరించుకోవడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌లో చీలిక తీసుకురావడమే ఆమె అసలు ప్లాన్. రాజకీయాల్లో కేవలం సెంటిమెంట్‌తోనే ఓట్లు పడవని గుర్తించిన కవిత, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడిన చోట తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైతే, అది కాంగ్రెస్‌కో లేదా బీజేపీకో వెళ్లకుండా తన కొత్త పార్టీ ఒక షెల్టర్ లాగా ఉపయోగపడాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ వ్యూహం గనుక పారితే, బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే, బీఆర్ఎస్ పునాదుల మీదనే తన రాజకీయ సౌధాన్ని నిర్మించుకోవాలని కవిత గట్టి నిర్ణయానికి వచ్చారు.

రాజకీయాల్లో బంధుత్వాలు ఉండవు.. కేవలం బాధ్యతలే ఉంటాయి అనే సంకేతాన్ని కవిత ఇప్పటికే ఇచ్చారు. కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె బహిరంగంగానే తప్పుపట్టడం ద్వారా, తాను బీఆర్ఎస్ బి–టీమ్ కాదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆవిర్భావ సభ తర్వాత ఆమె చేపట్టబోయే కార్యక్రమాలు కూడా బీఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేశారు. ఇది కచ్చితంగా గులాబీ దళానికి ఒక హెచ్చరిక లాంటిదే. కవిత రాజకీయ చదరంగంలో తొలి పావును అత్యంత తెలివిగా కదిపారు. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలను వదిలేసి, తన సొంత ఇంటి ఓటు బ్యాంకుపైనే ఆమె యుద్ధం ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది. రేపటి సభలో ఆమె ప్రకటించబోయే పార్టీ పేరు, విధివిధానాలు బీఆర్ఎస్ భవిష్యత్తును ఏ మేరకు ప్రభావితం చేస్తాయోనన్న ఆందోళన ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కవిత కొత్త ప్రయోగం’ విజయవంతమైతే, తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడం అత్యంత కష్టతరంగా మారవచ్చు.

# ఆస్తులతో పాటు అప్పులు....

హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు తన సొంత రాజకీయ పార్టీతో ప్రజల పరీక్షను ఎదుర్కోనున్నారు. అయితే ఆమెకు ఉన్న ఆస్తులు ఎన్ని, ఆమె ఇన్‌కమ్ సోర్స్ ఏంటనే చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో గతంలో అంటే ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం కొన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి.. కవిత ఆస్తులు గత కొన్నేళ్లుగా అనూహ్యంగా పెరిగాయి. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఆమె మొత్తం ఆస్తుల విలువ 7. 63 కోట్లుగా ఉంది. అయితే 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి ఆస్తులు పెరిగినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అప్పుడు చెప్పిన వివరాల ప్రకారం ఆమె ఆస్తులు విలువ 39.79 కోట్లు దాటింది. అంటే కేవలం ఆ మూడేళ్ల వ్యవధిలోనే ఆమె ఆస్తులు దాదాపు రెట్టింపు కంటే ఎక్కువ పెరిగాయి. ఇందులో చరాస్తుల విలువ రూ. 14. 78కోట్లు కాగా, స్థిరాస్తుల విలువ 5.70 కోట్లుగా ఉంది. కవిత వాహనాల వినియోగంపై కూడా ప్రజల్లో ఆసక్తి ఉంది. ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ఆమె వద్ద టయోటా ఫార్చ్యూనర్ కారు ఉంది. దీని విలువ సుమారు 7.58 లక్షలుగా చూపారు. ప్రస్తుతం ఆమె వద్ద ఉన్న కార్ల సమాచారం అందుబాటులో లేదు. అయితే ఆమె భద్రత దృష్ట్యా ప్రభుత్వం కల్పించిన వాహనాలపై అప్పట్లో దుమారం రేగింది. మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో 2016లో ఆమెకు బుల్లెట్ ప్రూఫ్ పార్చ్యూనర్ వాహనాన్ని కేటాయించారు అంతేకాకుండా బీఆర్ఎస్ హయాంలో కొనుగోలు చేసిన 22 ల్యాండ్ క్రూయిజర్ వాహనాల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ వాహనాలు కేసీఆర్ కాన్వాయ్ కోసం కొనుగోలు చేశారని ప్రస్తుతం ప్రభుత్వం ఆరోపించగా, భద్రతా ప్రోటోకాల్‌లో భాగంగానే నిఘా వర్గాలు వీటిని ఏర్పాటు చేసినట్టు కవిత స్పష్టం చేశారు. కవిత కేవలం రాజకీయ నేతగానే కాకుండా తనను తాను బిజినెస్ ఉమెన్‌గా కూడా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆమె పెట్టుబడులు ప్రధానంగా రియల్ ఎస్టేట్, ఫార్మా రంగాల్లో ఉన్నాయి. స్ట్రక్చర్ డెవలపర్స్‌లో ఆమెకు 4.99 కోట్ల విలువైన వాటాలు ఉన్నాయి. నెట్‌పిక్సెల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆమె పెట్టుబడులు పెట్టారు. రిలిక్సర్ ఫార్మస్యూటికల్స్‌లో ఆమె భర్త అనిల్ కుమారు ప్రధాన భాగస్వామిగా ఉన్నారు. ఇందులో సుమారు 9.21 కోట్ల పెట్టుబడి ఉంది. వీటితోపాటు, భారత్ జాగృతి ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక కార్యక్రమాల్లో కూడా ఆమె చురుగ్గా పాల్గొంటున్నారు. కవిత తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో విలువైన భూములు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని మల్లె బోయినపల్లిలో తన తండ్రి కేసీఆర్ బహుమతిగా ఇచ్చిన పది ఎకరాల 16 గుంటల వ్యవసాయ భూమి ఆమె పేరిట ఉంది. వీటితోపాటు నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట జిల్లాలో కూడా వ్యవసాయ భూములు ఉన్నాయి. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో నివాస భవనంతోపాటు సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులో వాణిజ్య భవనాలు కూడా ఆమె ఆస్తుల జాబితాలో ఉన్నాయి. కవిత వద్ద 1.95 కిలోల బంగారం, డైమండ్ ఆభరణాలు ఉన్నట్టు అఫిడవిట్ పేర్కొంది. అలాగే 11.2 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు 70.71 లక్షలుగా అప్పట్లో లెక్కించారు.

### కవిత పేరుతో భారీగా అప్పులు

ఆస్తులు పెరుగుదలతోపాటు ఆమె అప్పులు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఆమెపై మొత్తం రూ. 21. 62 కోట్ల మేర రుణం ఉంది. ఇందులో బ్యాంక్ ఆఫ్ బరోడాలో తీసుకున్న కార్ లోన్(10.18లక్షలు), గోల్డ్ లోన్ (24 లక్షలు) రూ. 1.16 కోట్ల మార్టిగేజ్‌లోన్ ఉన్నాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు కోసం ఆమె 7 కోట్ల మేర అప్పు చేశారు. కవిత 1978లో కరీంనగర్‌లో జన్మించారు. జేఎన్టీయూ నుంచి బీటెక్ పూర్తి చేసిన ఆమె, అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ సదరన్ మిస్సిస్సిపీ నుంచి మాస్టర్ డిగ్రీ పొందారు. 2004లో భారత్‌కు తిరిగి వచ్చి ఆమె తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించి మలి దశ తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. కవిత ఆస్తుల లెక్కలు 2021లో ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం ఉన్నాయి. ఇప్పుడు వీటిలో చాలా మార్పులు జరిగి ఉంటాయి.

# కవిత పార్టీపేరు టీఆర్ఎస్

# తెలంగాణ రాష్ట్ర సేన



హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో మరో కొత్త పార్టీ అడుగుపెట్టింది. బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత కొత్త పార్టీని ప్రకటించింది. శనివారం ఉదయం మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ఆవిర్భావ సభలో ఆమె తన కొత్త పార్టీ పేరును అధికారికంగా ప్రకటటించి. అంతకు ముందే ఆమె సభా వేదికపై అమరవీరుల స్థూపం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, బతుకమ్మతో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళు లర్పించింది.అనంతరం అలాగే పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. తన పార్టీ పేరు టీఆర్ఎస్‌గా ప్రకటించారు. టీఆర్ఎస్ అంటే తెలంగాణ రాష్ట్ర సేన అని కవిత చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజని ఆమె చెప్పుకొచ్చారు. తెలంగాణ కోసం ఉద్యమంలో ఎంతో మంది ప్రాణాలర్పించారు.. ఉద్యమంలో బతుకమ్మ ఎత్తుకుని ఊరూరా తిరిగా.. బతుకమ్మ వచ్చిన తర్వాత ఉద్యమానికి ఊపొచ్చిందని కవిత తెలిపారు.తెలంగాణ వచ్చి 12 ఏళ్లైనా మన కలలు నెరవేరలేదని.. కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమరథం దారితప్పిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయనుకున్నాం కానీ వ్యక్తిగత స్వేచ్ఛ పోయిందంది కవిత.. ఎవరి ఫోన్ ఎవరు వింటున్నారో కూడా తెలియని భయం చాలా మందిలో ఉందన్నారు.

తెలంగాణను వ్యతిరేకంచిన వారికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారు.. కానీ పార్టీ కోసం అండగా నిలిచిన వారిని గాలికి వదిలేశారు. అధికారం వచ్చాక కేసీఆర్‌కు మమకారం పోయింది. అందుకే చెబుతున్నా ఆయన మన కేసీఆర్ కాదు.. మారిన కేసీఆర్ .. ప్రాణాలు అడ్డం పెట్టుకొని రాష్ట్రాన్ని కాపాడాల్సిన సైన్యం కావాలని కవిత చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందన్న దానికి తనను పార్టీలో నుంచి తీసేశారని.. అవినీతి చేసిన పందికొక్కులను పక్కన చేర్చుకున్నారని కవిత ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సేన పేరుతో సామాజిక న్యాయం, రాష్ట్ర ఆకాంక్షలను సాధించడమే లక్ష్యంగా పార్టీ పెడుతున్నట్టు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చినప్పటికీ సామాజిక తెలంగాణ సాధన రథం ఎక్కడో దారి తప్పిందని చెప్పుకొచ్చారు. అందుకే తాను పార్టీ పెట్టాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ రూల్స్ ప్రకారం సరిగా ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల ఆత్మను, ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబించడంలో పూర్తిగా దారి తప్పిందన్నారు. ఆ పార్టీ పేరులో ఉన్న తెలంగాణను తొలగించి ప్రజల గుండెల్లో చోటు కోల్పోయిందని ఆరోపించారు. అందుకే తాను తెలంగాణ ప్రజలను ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర సేనతో ప్రజల ముందుకు వచ్చానని వివరించారు.

జాగృతి నుంచి టీఆర్ఎస్ వరకు

పార్టీ ప్రకటించిన సందర్భంగా మాట్లాడిన కవిత తనకు ఇదొక మరుపురాని రోజుగా జీవితంలో గుర్తిండిపోతుందని అన్నారు. అందరం కలిసి పని చేసేలా ఆ దేవుడే ఇలా చేశారని చెప్పుకొచ్చారు. " ఏం జరుగుతుందని రాష్ట్రంలో చాలా మంది ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లుగా నేను, తెలంగాణ జాగృతి పోషించిన పాత్ర మీకు తెలుసు. ఆడబిడ్డలందరినీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేలా ఊరురా బతుకమ్మ కార్యక్రమం ద్వారా చేశాం . జాగృతి ఆడబిడ్డల చేతిలో కాగడ అయ్యింది. మన సంస్కృతి గురించి చెప్పుకోవటానికి బతుకమ్మ వచ్చాక బలం వచ్చింది. ఇది మా సంస్కృతిని అని బతుకమ్మ పాట ద్వారా పునః పరిచయం చేసుకున్నాం. తెలంగాణ ఉద్యమానికి బలమైన పునాది వేసింది మా జాగృతి ఆడబిడ్డలు. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం. కానీ మనం కలలు కన్నా తెలంగాణ రాలేదు." అని అన్నారు. తెలంగాణ ప్రజల కలలు ఇప్పటికీ కూడా నిజం కాలేదన్నారు కవిత. కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పిందని మండిపడ్డారు. సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైందని ఆరోపించారు. ఏ తరహాలో పని చేయాలో అలా జరగలేదని చెప్పటానికి బాధగా ఉందని వివరించారు. "ఇసుక దందా మీద ప్రేమతో దళితుల చావులకు కారణమైంది. ఫోన్ మాట్లాడాలంటే భయం. దారుణమైన నిఘా నీడలో మనం బతికాం" తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డార

తప్పులు సరిద్దుకోవాల్సిన టైం వచ్చింది

ఇప్పటి వరకు జరిగిన తప్పులు దిద్దుకోవటానికి కష్టపడి పనిచేయాలన్నారు కవిత. అందుకోసమే తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రజల ముందుకు వస్తున్నట్టు ప్రకటించారు. పోరాటాలకు రాజకీయ శక్తి, అధికారం ఉంటే ఇంకా బాగా పనిచేయవచ్చన్నారు. అందుకోసమే పార్టీ మీ ముందుకు వచ్చిందని తెలిపారు. "రాజకీయ పార్టీకి రాజకీయ ఆత్మ ఉండాలి. అజెండా ఉండాలి. బీఆర్ఎస్ అనే పార్టీ తెలంగాణ ఆత్మ కోల్పోయింది. అందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది." అని వివరించారు. తెలంగాణలోని మూడు కోట్ల మందికి ఒక అమ్మలాగా మారాలని ఉందని కవిత చెప్పారు. అమ్మతనంతో, ఆర్తితో పాలన జరిగినప్పుడే కష్టాలు తీరుతాయన్నారు. రైతాంగ పోరాటం, ముల్కీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం ఇలా సాగుతూనే ఉందని గుర్తు చేశారు. చాకలి ఐలమ్మ, గద్దరన్న, మారోజు వీరన్న సహా అనేక మంది పోరాటం చేస్తేనే ఇలా మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. అమర వీరులు, కేసీఆర్ అనేక మంది కొట్లాడితేనే తెలంగాణ వచ్చిందన్నారు. సమ్మక్క సారక్క నాటి నుంచే సామాజిక పోరాటం జరిగిందని వెల్లడించారు. కొండ లక్ష్మణ్ బాపూజీ, పాపన్న గౌడ్, పంతు నాయక్ , జనార్ధన్ రావు స్ఫూర్తిని తీసుకుంటామని ప్రకటించారు. రాజ్యాంగ బద్ధంగా రాజకీయ శక్తితో ప్రజాపోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణను సాధిస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సేన మీ ముందుకు ఊరికే రాలేదని చాలా సుదీర్ఘమైన లక్షంతోనే ప్రజలకు సేవ చేసేందుకు వచ్చామని పేర్కొన్నారు

# కేసీఆర్ నిర్మించిన పునాదులపైనే

# కవిత పార్టీ

హైదరాబాద్, ఏప్రిల్ 25, టీఆర్ఎస్ పేరుతో పార్టీని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రస్థానంలో ఒక సాహసోపేతమైన మలుపు తీసుకున్నారు. కేవలం ఒక కొత్త పార్టీని స్థాపించడమే కాకుండా, తన తండ్రి కేసీఆర్ నిర్మించిన రాజకీయ పునాదుల పైనే ఎదిగేలా ఆమె రెడీ చేసుకున్న రూట్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులు తీసుకు రానుంది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్ గా మార్చే ఆలోచన ఉందని కేటీఆర్ చెప్పారు. దీనికి కారణం ప్రజలు బీఆర్ఎస్ పేరు మార్పుతో అనుబంధం కోల్పోయినట్లుగా ఫీలవుతున్నారని కూడా చెప్పారు. అయితే బీఆర్ఎస్ పార్టీని మళ్లీ టీఆర్ఎస్ గా మార్చేందుకు ఆసక్తి చూపించలేదు. ఇంతలోనే కవిత పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన గా ప్రకటించారు. దీని వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉంది. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత తెలంగాణ సమాజంలో టీఆర్ఎస్ అనే బ్రాండ్ పట్ల ఉన్న సెంటిమెంట్ అనాథగా మారిందని ఆమె గుర్తించారు. ఇప్పుడు సేన పేరుతో ఆ పాత బ్రాండ్‌ను తిరిగి సొంతం చేసుకోవడం ద్వారా, తెలంగాణ అస్తిత్వానికి అసలైన వారసురాలిని తానే అని ప్రజలకు సంకేతం ఇచ్చారు. టీఆర్ఎస్ అంటే ఇప్పుడు నా పార్టీయే అనే అర్థం వచ్చేలా ఆమె చేసిన ప్రసంగం, ఉద్యమకారులను తనవైపు తిప్పుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది.తన ప్రసంగంలో కవిత ఎక్కడా తండ్రి పట్ల మమకారం చూపలేదు. కేసీఆర్ ఒకప్పుడు ఉద్యమ వీరుడని, కానీ ఇప్పుడు ఆయన కేవలం ఒక మరమనిషి గా మారిపోయారని వ్యాఖ్యానించడం ద్వారా ఆమె తన రాజకీయ దారిని స్పష్టం చేసుకున్నారు. కుటుంబ సభ్యురాలిగా గత పదేళ్ల పాలనలోని వైఫల్యాలకు క్షమాపణలు కోరడం ద్వారా, ఆమె ప్రజల ముందు ఒక క్లీన్ ఇమేజ్ తో రావాలని ఆశిస్తున్నారు. తండ్రి నీడ నుండి బయటకు వచ్చి, సొంతంగా ఎదిగే క్రమంలో ఆమె సెంటిమెంట్లను పక్కన పెట్టేసి అత్యంత వాస్తవిక రాజకీయాలను ఎంచుకున్నారు.సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైంది అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ హయాంలో అణచివేతకు గురైన వర్గాలను ఉద్దేశించినవే. రైతులకు సంకెళ్లు, దళితులకు దెబ్బలు, ఫోన్ ట్యాపింగ్‌తో నిఘా నీడన బతుకులు.. ఇవేవీ మనం కోరుకున్న తెలంగాణ కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని, దానికి ప్రత్యామ్నాయంగా తాను ఒక ప్రజాస్వామ్యయుత వేదికను అందిస్తున్నానని ఆమె కన్విన్సింగ్ గా చెప్పుకోగలిగారు. పార్టీలో తనను పక్కన పెట్టి, అవినీతి పరులైన పందికొక్కుల్ని కేసీఆర్ నెత్తిన పెట్టుకున్నారని కవిత చేసిన ఆరోపణ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోంది. పార్టీని దోచుకునే వారికి ప్రాధాన్యత పెరిగిందని, నిబద్ధత గల వారికి స్థానం లేదని ఆమె మండిపడ్డారు. ఈ వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని తన పార్టీ వైపు ఆకర్షించేందుకు ఆమె గట్టి పునాది వేశారు. తన టీఆర్ఎస్ లో పారదర్శకత ఉంటుందని, అవినీతికి తావుండదని ఆమె హామీ ఇచ్చారు.చివరగా, తాను ఒక అమ్మగా ప్రజల కష్టాలు తీరుస్తానని చెప్పడం ద్వారా ఆమె ఒక ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచుకున్నారు. బీఆర్ఎస్ ఒక కార్పొరేట్ సంస్థలా మారిందని, తన తెలంగాణ రాష్ట్ర సేన మాత్రం ఒక కుటుంబంలా ఉంటుందని ఆమె నమ్మించగలిగారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా తన అడుగులు వేస్తున్నారు. తెలంగాణ గడ్డపై ఇప్పుడు అసలైన టీఆర్ఎస్ పోరు మొదలైందని ఆమె చాటిచెప్పారు. కవిత రాజకీయంతో బీఆర్ఎస్ పార్టీకి చిక్కులు తప్పకపోవచ్చనిరాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# కవిత టీఆర్ఎస్ పేరుకు ఈసీ

# అనుమతి ఇస్తుందా

హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణ ప్రజల గుండెల్లో బలంగా నాటుకుపోయిన టీఆర్ఎస్ అనే పేరు ఇప్పుడు బీఆర్ఎస్ అధినాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేసే అంశంగా మారుతోంది. జాతీయ రాజకీయాల కోసం కేసీఆర్ తన పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చినా క్షేత్రస్థాయిలో తెలంగాణ అనే పదం లేకపోవడం ఒక లోటుగా మిగిలిపోయింది. అదే అవకాశంగా కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ ప్రకటన చేశారు. కవితపార్టీ పేరును ఎన్నికల సంఘం ఆమోదించదని బీఆర్ఎస్ నేతలు ఆశాభావంతో ఉన్నారు. అసలుకు..నకిలీకి చాలా తేడా ఉంటుందని బీఆర్ఎస్ సెటైర్లు వేస్తోంది. ఆ పార్టీ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి టీఆర్ఎస్ పేరును ఈసీ ఆమోదించదు కాబట్టి బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చెందాల్సినపనిలేదని అంటున్నారు. భారత ఎన్నికల సంఘం రికార్డుల ప్రకారం, ఒకసారి ఒక పార్టీ తన పేరును అధికారికంగా మార్చుకున్నప్పుడు, పాత పేరు ఫ్రీ పూల్ లోకి వెళ్తుంది. అంటే సాంకేతికంగా తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరు ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అయితే, ఎన్నికల గుర్తుల రూల్స్ ప్రకారం, ఓటర్లను తప్పుదోవ పట్టించేలా ఉన్న పేర్లను కేటాయించకూడదని ఈసీకి విచక్షణాధికారం ఉంటుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న టీఆర్ఎస్ పేరును వేరొకరికి ఇవ్వడం వల్ల ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ గట్టిగా వాదించవచ్చు. కానీ ఇక్కడ కవిత నేరుగా తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరు పెట్టలేదు. తెలివిగా.. తెలంగాణ రాష్ట్ర సేన అని పెట్టారు. షార్ట్ కట్ పేర్లను ఈసీ పెద్దగా పట్టించుకోకపోవచ్చు.

కవితకు పార్టీ పేరు అందకుండా కేసీఆర్ న్యాయపోరాటం ఖాయం

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజలు టీఆర్ఎస్ ను తమ సొంత ఇంటి పార్టీగా భావించారు. బీఆర్ఎస్‌గా మారిన తర్వాత, ఆ పార్టీకి ఉన్న ప్రాంతీయ బ్రాండ్ ఇమేజ్ కొంత మసకబారిందనేది కాదనలేని వాస్తవం. అందుకే టీఆర్ఎస్ పేరు కోసం కవిత ఈసీకి దరఖాస్తు చేసినప్పుడు, బీఆర్ఎస్ కచ్చితంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంది. ఈసీ అనుమతిస్తే ఢిల్లీ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు వరకు వెళ్లే అవకాశం ఉంది. అయితే, ఈ న్యాయపోరాటం ఫలితం ఎలా ఉన్నా, ఆ ప్రక్రియలో జరిగే చర్చ ప్రజల్లోకి నెగటివ్ సంకేతాలను పంపుతుంది. తమ పాత పేరును కూడా కాపాడుకోలేకపోతున్నారా " అనే భావన ప్రజల్లో కలిగితే అది పార్టీ నైతిక బలాన్ని తగ్గిస్తుంది. బీఆర్ఎస్ ఈ చర్చను కొనసాగించాలా లేదా అన్నది వారు ఖరారు చేసుకునే వ్యూహాలను బట్టి ఉంటుంది.

పేరు వెనుక ఉన్న పవర్ పాలిటిక్స్

రాజకీయాల్లో గుర్తు కంటే పేరు కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది, ముఖ్యంగా ప్రాంతీయ ఆకాంక్షలతో ముడిపడినప్పుడు. అందుకే బీఆర్ఎస్ ఇప్పుడు ఇరకాటంలో పడటం ఖాయం . టీఆర్ఎస్ అనేది కేవలం మూడు అక్షరాలు మాత్రమే కాదు.. అది తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పగల ఒక శక్తివంతమైన ఆయుధం. టీఆర్ఎస్ పేరు తిరిగి తెరపైకి రావడం అదీ కూడా కవిత వైపు నుంచి రావడం బీఆర్ఎస్‌కు అతిపెద్ద రాజకీయ ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. సాంకేతికత కంటే రాజకీయ సెంటిమెంటే ఇక్కడ కీలక పాత్ర పోషించనుంది

# ఒరిజనల్ ఎప్పుడు ఒరిజనలే...



హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని పేరు పెట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా స్పందించింది.ఈ మేరకు బీఆర్ఎస్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ సెటైరికల్ పోస్టు పెట్టింది. కోల్‌గేట్ టూత్‌పేస్ట్, బిస్లేరీ వాటర్ బాటిల్‌కు సంబంధించి ఒరిజినల్, నకిలీ ఉత్పత్తుల ఫొటోలను పక్కపక్కనే జోడించింది. దీనికి "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!" అనే క్యాప్షన్‌ను జత చేసింది.కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెట్టుకున్నప్పటికీ, తామే అసలైన పార్టీ అని బీఆర్ఎస్ ఈ పోస్టు ద్వారా పరోక్షంగా స్పష్టం చేసింది. తమ పార్టీ బ్రాండ్‌కే ప్రజల్లో ఆదరణ ఉంటుందని, కొత్తగా వచ్చిన పార్టీకి కాదని చెప్పకనే చెప్పింది. రాష్ట్రంలో అసలైన తెలంగాణ వాద పార్టీ తమదేనని చాటుకునే ప్రయత్నం చేసింది.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నుంచి ఈ స్పందన వచ్చింది. దీంతో టీఆర్ఎస్ పేరు చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.

# నన్ను క్షమించండి....

హైదరాబాద్, ఏప్రిల్ 25, కేసీఆర్ పాలనలో ఆశించిన ఫలితాలు రాలేదని, ఆనాడు పరిపాలించిన కుటుంబంలో తాను భాగస్వామినైనందుకు తెలంగాణ ప్రజలు తనను క్షమించాలని తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. సామాజిక తెలంగాణ కోసం అవతలివాడు మనవాడైనా యుద్ధం చేయడానికి పాంచజన్యం పూరిస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారుమేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎలా ఉందంటే, ఫామ్ హౌస్‌లో పెద్దసారు ఉండాలి, చిన్నసారు ముఖ్యమంత్రి కావాలనే విధంగా ఉందని కేసీఆర్, కేటీఆర్‌లను ఉద్దేశించి విమర్శించారు. మన యుద్ధం మూడు పార్టీలపై ఉంటుందని అన్నారు. ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తామని అన్నారు.నాడు ఉపఎన్నిక కోసమే దళితబంధు ప్రకటించారని ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఏ కలలతో మనం తెలంగాణను సాధించుకున్నామో అవి నిజం కాలేదని ఆమె అన్నారు. ఈరోజు నా జీవితంలో మరిచిపోలేని రోజు అని అన్నారు. తెలంగాణ భవిష్యత్తు రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలని అన్నారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పిందని విమర్శించారు.టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోవడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైందని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఏం పనులు జరగాలో కేసీఆర్ పాలనలో అవి జరగలేదని ఆరోపించారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించామని, కానీ రైతులకు బేడీలు పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అంతా నిఘా నీడలో ఉందని అన్నారు.కేసీఆర్ పాలనలో తానూ భాగస్వామినైనందుకు సిగ్గుపడుతున్నానని, అందుకే ప్రజలను క్షమించమని కోరుతున్నానని అన్నారు. తెలంగాణ సాధించినందుకు గర్విస్తున్నాను కానీ పాలన సమయంలో తప్పులో భాగస్వామినైనందుకు ఆవేదనగా ఉందని అన్నారు. అందుకు తాను కేవలం క్షమాపణ చెబితే సరిపోదని, సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలని అన్నారు.

## ఎటీఎం పేమెంట్స్ బ్యాంక్ కథ ముగిసింది...

## లైసెన్స్ రద్దు చేసిన ఆర్బీఐ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రముఖ యూపీఐ ఆధారిత ఆర్థిక సేవల సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్సును రద్దు చేసింది. నేడు (ఏప్రిల్ 24వ తేదీన) పనివేళలు ముగిసిన తర్వాత ఈ రద్దు నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆర్బీఐ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది.బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, సెక్షన్ 22(4) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఈ నిర్ణయంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ తక్షణమే ఎలాంటి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధించింది. బ్యాంకును పూర్తిగా మూసివేసే (వైండింగ్ అప్) ప్రక్రియ కోసం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కూడా వెల్లడించింది.అయితే, డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్బీఐ భరోసా ఇచ్చింది. బ్యాంకు వద్ద ఉన్న డిపాజిటర్లందరికీ వారి డబ్బును తిరిగి చెల్లించేందుకు సరిపడా నగదు నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది.బ్యాంకు కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉండటం, యాజమాన్యం తీరు ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటం, లైసెన్స్ షరతులను ఉల్లంఘించడం వంటి కారణాలతో లైసెన్సును రద్దు చేసినట్లు ఆర్బీఐ వివరించింది. గతంలో 2022 మార్చి నుంచి కొత్త కస్టమర్ల చేరికపై, 2024 జనవరి నుంచి డిపాజిట్లు, టాప్-అప్‌లపై ఆర్బీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా పూర్తిస్థాయిలో లైసెన్సును రద్దు చేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది.

## బెజవాడలో టిడిపి జనసేన

## నేతల మధ్య గొడవ

విజయవాడ మైలవరం ఎమ్మెల్యే అనుచరులు, దెందులూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఘంటశాల వెంకటలక్ష్మిల మధ్య ఘర్షణ జరిగింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పోలీసుల సాక్షిగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మహిళా నాయకురాలి పై దాడికి ప్రయత్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డర లు కార్పోరేషన్ చైర్ పర్సన్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గ ఇన్చార్జి ఘంటశాల వెంకటలక్ష్మి పై దాడికి యత్నం చేసారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం




**రాజన్న సిరిసిల్ల జిల్లా,ఏప్రిల్ - 25 (ప్రజాబలం ప్రతినిధి)**ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా అంతం చేద్దాం- ఆరోగ్యమైన (సమాజాన్ని) రేపటి నీ నిర్మిద్దాం" నినాదంతో ముస్తాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవం అవగాహన కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అధ్యక్షతన నిర్వహించడమైనది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ మలేరియా ను జయిద్దాం- ప్రతి ఒక్కరూ కలిసి కృషి చేద్దాం అని, మలేరియా అంతం చేసే దిశగా ఇప్పుడు మనం చేయగలం, ఇప్పుడు తప్పక చెయ్యాలి అనే నినాదంతో జాగ్రత్తలతోటే మలేరియా దూరమవుతుందని, మలేరియా నివారణ పాటించవలసిన ముఖ్యమైన చర్యలు ఇళ్లల్లో, పరిసరాలలో నీటి నిల్వ ఉండకుండా చూడాలని, నీటి ట్యాంకులు, డబ్బాలు మూత లతో మూసి ఉంచాలని, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి నిల్వ తొట్టిలు కనీసం వారమునకు ఒక్కోసారి శుభ్రం చేసుకోవాల్సిందిగా దీని ద్వారా లార్వా వృద్ధి చెందదని, దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు మెష్ డోర్లు బిగించాలని, దోమలు పెరగకుండా నివారణ కొరకు మందులు చెల్లించాలని, ఒకవేళ దోమ కాటు వల్ల వణుకు జ్వరం , తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులు అలసట అంటే వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష చేసుకోవాల్సిందిగా సూచిస్తూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలలో విధిగా మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించవలసిందిగా ఆశాలకు, ఏఎన్ఎంలకు సూచించినారు. ఈ సందర్భంగా మనమంతా కలిసి మలేరియా రహిత జిల్లాను నిర్మించాలని, అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమానికి పోతుగల్లు సర్పంచ్ యాదమ్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ నహిమా, ప్రాథమిక కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ ఆఫీ జ, డాక్టర్ గీతాంజలి, డిప్యూడెమో రాజ్ కుమార్ , సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.




# చిలకలగూడలో కూల్చివేతలు

సికింద్రాబాద్.. చిలకలగూడ నుండి వారసిగూడ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు. రహదారుల కు ఇరువైపులా ఫుట్ పాత్ లను ఆక్రమించి వాహనదారులు పాదచారులకు ఇబ్బందిగా మారిన తరుణంలో వ్యాపార సముదాయాలను జెసిబి సహాయంతో అక్కడి నుండి తొలగించి వాహనదారులకు పాదచారులకు ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలిపారు. చిలకలగూడ నుండి వారాసిగూడ వరకు రహదారికి ఇరువైపులా విస్తరించిన అక్రమ వ్యాపార సముదాయాలపై ఉక్కుపాదం మోపారు. ప్రజా అవసరాల దృష్ట్యా ఈ చర్యలను చేపట్టినట్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా వెసులుబాటు కలిగినట్లు జిహెచ్ఎంసి ట్రాఫిక్ అధికారులు తెలిపారు.పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన షెడ్లు, తాత్కాలిక దుకాణాలు, నిర్మాణ సామగ్రిని జేసీబీల సహాయంతో క్లియర్ చేశారు. ట్రాఫిక్ సమస్యలు పెరగడంతో పాటు ప్రజలు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా




సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పెరుమాల్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా జరిగింది. ఐటి, ఫార్మా తో పాటు దాదాపు 150 కంపెనీ లు ఇందులో పాల్గొన్నాయి 624 మంది ఉద్యోగం పొందారు అని తెలిసింది . సిద్దిపేట జిల్లా పోలీస్ యంత్రంగం అంతా జాబ్ మేళా లో పాల్గొనడం విశేషం!. సీపీ ప్రతి స్టాల్ ను సందర్శిస్తూ సెలెక్ట్ అయిన యువతీ యువకులకు స్వయంగా నియామక పత్రాలు అందజేసారు. పోలీస్ లు అంటే లా అండ్ ఆర్డర్ కాపాడటమే కాదు అని సిద్దిపేట పోలీస్ నిరూపించారు. మన ఊరు మన పల్లె పేరుతో కూడా సిద్దిపేట సీపీ సామజిక కార్యక్రమం లో పాల్గొంటున్నారు పలు అంశాల పట్ల ప్రజల్ని చైతన్యం చేస్తున్నారు.

సమాజం లో యువత సరైన అవకాశాలు లేక చెడు దారులను ఎంచుకుంటున్నారు... జాబ్ ఎలా ఎక్కడ చేయాలో చాలా మందికి అవగాహనా కూడా ఉండటం లేదు. సో అందరికి ఒక అవకాశం ఇస్తే తమ ప్రతిభ నిరూపించుకుని ఉద్యోగం సాధిస్తారని భావించి జాబ్ మేళా నిర్వహించినట్టు సీపీ తెలిపారు. సామాజిక బాధ్యత గా భావించి, సమాజానికి మనం కూడా ఎంతో కొంత సేవ చేయాలనీ జాబ్ మేళా చేపట్టామని సిద్దిపేట త్రీ టౌన్ సిఐ లక్ష్మణ్ బాబు అన్నారు. అపోయింట్మెంట్ ఆర్డర్ తీసుకున్న యువత కళ్ళ లో ఆనందం చూస్తే ఎంతో గొప్ప ఫీలింగ్ కలిగిందన్నారు... మధ్యాహ్నం వరకు వివిధ కంపెనీ లలో వందకు పైగా యువత సెలెక్ట్ అయ్యారు

## ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం



పత్తికొండ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ కార్తీక్ అధ్యర్యములో పత్తికొండ పట్టణములో జూనియర్ కళాశాల నుండి సుంకం గేటు ద్వారా చక్రాల రోడ్డు వీధుల్లో ప్రపంచ మలేరియా దినోత్సవం పై ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ సందర్భంగా డాక్టర్ గారు మాట్లాడుచు "ఇప్పుడు మనం సాధించ గలం ఇప్పుడు మనం సాధించాలి " మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని తెలియజేశారు.దోమలు పుట్టకూడదు దోమలు కుట్టకూడదు అనే నినాదంతో ,ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని,ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా చలి, వణుకు తో కూడిన జ్వరము వచ్చునని కావున వెంటనే రక్త పరీక్ష చేపించు కొని మందులు వాడాలని, దోమలు పెరగకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని,ఇంటి పరిసరాలలో రోళ్ళు, టైర్లు, కొబ్బరి బొండాలు, టెంకాయచిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు లేకుండా చూడాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని, సాయంత్ర పూట వేపాకుపొగ వేసుకొనవలెనని స్లోగన్స్ ద్వారా అవగాహన కలిగించడమైనది.ఈ కార్యక్రమము నందు మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి సాయిబాబా ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రకాష్,మలేరియా హెల్త్ అసిస్టెంట్ రమేష్,ఆరోగ్య కార్యకర్తలు చాముండేశ్వరి,శంకరమ్మ, చైతన్య,లక్ష్మి,ఎంఎల్ హెచ్ పి లు కరుణ, ప్రసన్న, పుష్ప, అనిల్, మౌనిక, సాహెదా,ఐసీటీసీ సిబ్బంది కర్రెన్న , క్షయ సూపర్వైజర్ ఈరన్న మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# గందరగోళమన్న బీఆర్ఎస్ లైట్ అంటున్న బీజేపీ

హైదరాబాద్, ఏప్రిల్ 25, తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం (ఏప్రిల్ 25) సరికొత్త రాజకీయ పార్టీని ప్రకటించి సంచలనం సృష్టించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన భారీ ఆవిర్భావ సభలో తన పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన' (ఠఖీూ)గా ఆమె నామకరణం చేశారు. గతంలో తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ పేరునే (టీఆర్ఎస్) స్వల్ప మార్పుతో మళ్ళీ తెరపైకి తీసుకురావడం విశేషం.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ ఉద్యమంలో జాగృతి సంస్థ ద్వారా తాను పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. "వచ్చిన తెలంగాణ దారి తప్పింది. సామాజిక తెలంగాణ రథచక్రం విరిగిపోయింది. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కుటుంబంలో నేను భాగమైనందుకు కొన్ని విషయాల్లో, ముఖ్యంగా ఇసుక మాఫియా వంటి అంశాల్లో సిగ్గుపడుతున్నాను. కానీ, తెలంగాణ సాధించిన కుటుంబంలో ఉన్నందుకు గర్వపడుతున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ఐదు ప్రధాన అంశాలను 'పాంచజన్యం' పేరుతో ఐదు హామీలను కవిత ప్రకటించారు.

1. విద్య: ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఉచిత విద్య.
2. వైద్యం: ఏ ఆస్పత్రిలోనైనా ఉచిత వైద్య సేవలు.
3. వ్యవసాయం: రైతే రాజు నినాదాన్ని నిజం చేయడం.
4. ఉపాధి: యువతకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు. మొదటి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు, ఉద్యమకారుల కోసం లక్ష సూపర్‌న్యూమరీ పోస్టుల కేటాయింపు.
5. సామాజిక న్యాయం: అన్ని వర్గాల వారి సంక్షేమానికి ప్రాధాన్యత

కవిత ప్రకటనపై బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. టీఆర్ఎస్ ఫార్టీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం (ఇఅఎ) నిబంధనల ప్రకారం.. పాత పార్టీల పేర్లను పోలిన పేర్లతో కొత్త పార్టీలను అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం ప్రజలను గందరగోళానికి గురిచేసే ఎత్తుగడ మాత్రమేనని కొట్టిపారేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక చీ ద్వారా పేర్కొన్నారు.

మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందిస్తూ.. తెలంగాణలో ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి వచ్చే నష్టం లేదని ధీమా వ్యక్తం చేశారు. గతంలో టీఆర్ఎస్, ఇప్పుడు బీఆర్ఎస్, మళ్లీ ఇప్పుడు పుట్టబోయే టీఆర్ఎస్ అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలు అవినీతి రహిత మోదీ పాలన వైపే ఉన్నారని, తెలంగాణలో బీజేపీయే అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి కవిత కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

# పేటంట్స్ కోసం ప్లానింగ్...

హైదరాబాద్, ఏప్రిల్ 25, శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థుల సృజనాత్మకతకు చట్టబద్ధమైన గుర్తింపునిచ్చేందుకు ఉస్మానియా , జేఎన్‌టీయూ (విశ్వవిద్యాలయాలు నడుం బిగించాయి. సాధారణంగా న్యాయశాస్త్ర విద్యార్థులకే పరిమితమైన 'మేధో హక్కుల పరిరక్షణ' అంశంపై ఇప్పుడు సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాయి. వినూత్న ఆవిష్కరణలు చేసే విద్యార్థులకు తమ పేటెంట్ హక్కులను ఎలా కాపాడుకోవాలో నేర్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.ప్రతి ఏటా ఒక్కో విశ్వవిద్యాలయం నుండి కనీసం మూడు పేటెంట్లు, రెండు ట్రేడ్ మార్కు హక్కుల దరఖాస్తులు దాఖలు చేసేలా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సాంకేతిక సహకారాన్ని అందిస్తోంది. ఇందుకోసం ఉస్మానియా యూనివర్సిటీలో 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' కోర్సును అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు తమ 3వ లేదా 4వ సెమిస్టర్లలో ఈ కోర్సును అభ్యసించడం ద్వారా పరిశోధనలు, సాఫ్ట్‌వేర్ కాపీరైట్స్ వంటి అంశాలపై పూర్తి అవగాహన పొందే అవకాశం ఉంది.

ఉపాధి అవకాశాలు..

ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి బహుళజాతి సంస్థల్లో అద్భుతమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఐటీ సంస్థలకు కన్సల్టెంట్లుగా వ్యవహరిస్తూ సొంతంగానూ ఎదగవచ్చు.

ఓయూలో న్యాయశాస్త్రంతో పాటు ఈ ప్రత్యేక కోర్సులు చదివిన విద్యార్థులు ఎంఎన్‌సీలలో ఏడాదికి రూ. 30 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు జీతాన్ని అందుకుంటున్నారు.

యూపీకి చెందిన ముగ్గురు విద్యార్థులు నెలకు రూ. 8 లక్షల వేతనంతో సలహాదారులుగా నియమితులయ్యారు.

ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని ఐటీ కంపెనీల్లో రూ. 26 లక్షల వార్షిక వేతనంతో కన్సల్టెంట్ కొలువులు సాధించారు.

మొత్తానికి, విద్యార్థుల మేధస్సుకు చట్టపరమైన రక్షణ కల్పిస్తూనే, వారి భవిష్యత్తుకు ఈ కోర్సులు బంగారు బాటలు వేస్తున్నాయి.

# అదుపుతప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారు

## తాడేపల్లి భరతమాత సెంటర్‌లో ప్రమాదం క్షేమంగా బయటపడ్డ వ్యక్తి

తాడేపల్లి, ఏప్రిల్ 25, గుంటూరు జిల్లా తాడేపల్లిలోని భరతమాత సెంటర్ వద్ద శనివారం తెల్లవారుజామున ఓ కారు ప్రమాదానికి గురైంది. వేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న డ్రైనేజీ కాల్వలోకి దూసుకుపోయింది. ఈ ఘటన ఈరోజు



ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది.ప్రమాద సమయంలో కారులో ఉన్న ఎయిర్ బ్యాగులు (ఎయిర్ బెలూన్లు) వెంటనే తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డారు. కాగా, సదరు కారు పోలీస్ శాఖకు చెందినదిగా స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తి కిందకు దిగి, తన సెల్‌ఫోన్ మరియు వాకీటాకీని తీసుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ముఖ్య కార్యకర్తలతో, నాయకులతో సమావేశం నిర్వహించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

నంద్యాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఫరూక్ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి పనులు మరియు ప్రజల సమస్యలపై కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. నంద్యాల నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులతో సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని మంత్రి ఫరూక్ భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కరెంట్ బిల్లులు ఆన్ లైన్ లో చెల్లించండి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 25 ములుగు** ఎండల తీవ్రత దృష్ట్యా ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభం: వినియోగదారులకు సూపెరింటెండింగ్ ఇంజనీర్ విజ్ఞప్తి

రోజు రోజుకు సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యుత్ బిల్లుల చెల్లింపుల విషయంలో వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా చెల్లించడానికి ఆసక్తి చూపుతున్నారని ములుగు సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి తెలిపారు.

వినియోగదారుల సౌలభ్యం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్ పిడిసిఎల్) డిజిటల్ చెల్లింపుల విధానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు.

పెరుగుతున్న డిజిటల్ చెల్లింపులు: ప్రతి ఏటా 10 శాతం విద్యుత్ వినియోగదారులు తమ నెలవారీ బిల్లులను టి జి ఎన్ పి డి సి ఎల్ యాప్, టి. వ్యాలెట్, గూగుల్ ప్లే పేటీఎంవంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చెల్లిస్తున్నారని తెలిపారు.

గణాంకాలను పరిశీలిస్తే:

2024- 25 ఆర్థిక సంవత్సరం లో 6793 మంది వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు చేయగా,

2025- 26 ఆర్థిక సంవత్సరం లో 7807 మంది వినియోగదారులు డిజిటల్ విధానం ద్వారా చెల్లింపులు చేసారని తెలిపారు.

వేసవి తీవ్రత - ఇంటి వద్దే ఉండండి.. సురక్షితంగా చెల్లించండి!

ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున, వినియోగదారులు బిల్లుల చెల్లింపు కోసం బయటకు వచ్చి ఎండ దెబ్బకు గురికావద్దని ఎస్.ఈ విజ్ఞప్తి చేశారు.

"వేసవి తాపం దృష్ట్యా వినియోగదారులు విద్యుత్ కార్యాలయాల వద్ద ఉన్న కౌంటర్లకు రావాల్సిన అవసరం లేదు. మీ ఇంట్లోనే ఉండి, సురక్షితంగా ఆన్ లైన్ పద్ధతుల ద్వారా బిల్లులు చెల్లించి ఎండల నుంచి రక్షణ పొందండి" అని ఆయన సూచించారు.

ఆన్ లైన్ చెల్లింపుల ప్రయోజనాలు:

సౌలభ్యం: కార్యాలయ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా చెల్లింపు చేయవచ్చు.

సమయ ఆదా: కేవలం రెండు నిమిషాల్లో ఆలస్యం లేకుండా చెల్లించవచ్చు.

తక్షణ ధృవీకరణ: లావాదేవీ తక్షణమే నమోదవుతుంది.

సమాచారం: ప్రతి నెల విద్యుత్ బిల్లుల వివరాలు నేరుగా వినియోగదారుని మొబైల్‌కు అందుతాయి.

పారదర్శకత: అకౌంటింగ్ వ్యవస్థ పారదర్శకంగా, సురక్షితంగా ఉంటుంది.

చెల్లింపు విధానం:

విద్యుత్ వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ లోని ప్లే స్టోర్ లో టీ జీ ఎన్పీడీసీఎల్ అని టైప్ చేసి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి. అందులో విద్యుత్ బిల్లుపై ఉన్న యుఎస్సి (యూఎస్ఎల్) నంబర్ నమోదు చేసుకొని ప్రతి నెల బిల్లులను సులభంగా చెల్లించవచ్చు. ఇలా చేయడం వల్ల ప్రతి నెల చెల్లించవలసిన మొత్తంపై ముందస్తు సమాచారం (అలర్ట్) అందుతుందని ఆయన స్పష్టం చేశారు.

వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా, సేవలను సులభతరం చేయడం మరియు ఆధునీకరించడం దిశగా టీజీఎన్పీడీసీఎల్ నిరంతరం కృషి చేస్తుందని సూపెరింటెండింగ్ ఇంజనీర్ వివరించారు.

# ఆటో అన్నదమ్ముల మధ్య అగాధం సృష్టిస్తే ఊరుకునేది లేదు







**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** రవాణా శాఖ అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఆటో అన్నదమ్ముల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారు. అవి తాత్కాలికమే. మేమంతా పొట్ట చేత్తో పట్టుకొని రోజువారి కూలి మీద ఆధారపడి బతుకుతున్న ఆటోకన్నబిడ్డలం,అన్నదమ్ములం

పటాన్ చేరు నియోజకవర్గంలోని (జిఎంఆర్) ఆటో స్టాండ్ వద్ద, ఏర్పాటు చేసిన ఆటో యూనియన్ నాయకులసమావేశంలో,ముఖ్యఅతిథిగా,హాజరైన ఆటో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్కే దస్తగిరి,(చోటు)మాట్లాడుతూ,హైదరాబాదు ఆటోలు వేరని, జిల్లాల ఆటోలు వేరని హైదరాబాదుకు వేరే ఆటోలు రావద్దని విభేదాలు సృష్టిస్తున్న ప్రభుత్వంపై రవాణా శాఖ పెద్దలపై మండిపడ్డారు. ప్రజలకు ఏ సమయంలో ఏ ఆపద వస్తుందో తెలియదని అప్పటికప్పుడు ఆటోలు కావాలంటే ఏ ప్రాంతానికయినా ప్రజల అవసరం కోసం వెళ్లవలసి వస్తుందని ,ఇప్పటికైనా తమ తప్పుడు విధానాలు మానుకోని ఆటోకార్మికులకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని తక్షణమే ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని,దస్తగిరి, డిమాండ్ చేశారు,ఇంకా ఈ కార్యక్రమంలో ఖాదర్, నర్సింలు గౌడ్, అక్బర్, జియా, రఫీ, ఇస్మాయిల్, మోయిన్, రఫీక్, శ్రీనివాస్, డాన్, రాజు నాయక్, మోహన్ నాయక్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు....







# జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు.

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 25 ములుగు**జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులందరూ జనాభా స్వీయ గణనను చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జనగణన కార్యక్రమంలో భాగంగా మొదటి దశ అయిన గృహ లెక్కింపు మరియు గృహ వసతి గణన మీ11.05.2026 నుండి 09.06.2026 వరకు నిర్వహించబడనుందని తెలిపారు.

ఈ ప్రక్రియకు ముందుగా ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు స్వీయ లెక్కింపు సదుపాయాన్ని వెబ్ పోర్టల్ ద్వారా 26.04.2026 నుండి 10.05.2026 వరకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ గృహ మరియు కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా ప్రజలు

ఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి ఇది సులభమైన మరియు వేగవంతమైన విధానమని అన్నారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా నమోదు చేసుకోవచ్చుని సూచించారు.

నమోదు పూర్తయిన తర్వాత ఒక యూనిక్ కోడ్ వస్తుందని, దీనిని తదుపరి గణనాధికారి కి చూపించాలన్నారు.

స్వీయ లెక్కింపులో పాల్గొనడం ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు మరియు ఇతర వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలందరూ 26.04.2026 నుండి 10.05.2026 వరకు స్వీయ లెక్కింపులో తప్పనిసరిగా పాల్గొని జనగణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్. ప్రకటనలో తెలిపారు.

# నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 25 ములుగు** శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జిఓ ననుసరించి నియమ నిబంధనలు పాటించాలని అన్నారు.

మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు.

అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశం లో డిపిఆర్ఓ ఎం.డి. రఫిక్, డిఎంఏసి కమిటీ సభ్యులు

ఎం.డి. షఫీ అహ్మద్, గడ్డం దేవేందర్,

బి.పృథ్వీరాజ్, బండారి లక్ష్మణ్,

ఎం.డి. అబ్దుల్ గఫార్, చుంచు రవి,

కే.రాజేష్, వడ్లకొండ వీరయ్య,

బి.అశోక్. పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి

. సన్నరకాలు సాగు చేయాలి

. ప్యాడీ క్లీనర్లు వినియోగించాలి

. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ మెప్మా కొనుగోలు కేంద్రంలో పరిశీలన,



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -25(ప్రజాబలం ప్రతినిధి)**రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మెప్మా ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు.టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని ఆరా తీసి.. పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? సన్న రకం వడ్లు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల కేటాయింపు.. ఆన్లైన్లో వివరాల నమోదు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు ప్యాడీ క్లీనర్లు వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కేటాయించిన మిల్లులకు ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలని సూచించారు.పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు




**కూకట్పల్లి (ప్రజాబలం )ఏప్రిల్ 25:**ఆడుకుంటూ వెళ్ళి దారి తప్పిన ఓ రెండేళ్ల చిన్నారిని, పోలీసులు అత్యంత వేగంగా స్పందించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. మానవత్వంతో స్పందించిన స్థానికులు, సాంకేతికతను జోడించిన పోలీస్ కానిస్టేబుల్ ఖదీర్, హెచ్ జి రత్నంల కృషితో ఒక కుటుంబంలో మళ్ళీ చిరునవ్వులు పూశాయి.

బాలానగర్ సీఐ నర్సింహా రాజు తెలిపిన వివరాల ప్రకారం. గురుమూర్తి నగర్‌కు చెందిన చామంతి మహేందర్ కుమారుడు హేమేష్ (2 ఏళ్లు), ఉదయం స్థానిక స్నేహితులతో ఆడుకుంటూ ఇంటి నుండి బయటకు వచ్చాడు. దారి తెలియక ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్న బాలుడు, అడ్రస్ తెలియక దిక్కుతోచని స్థితిలో అటూ ఇటూ తిరుగుతూ కనిపించాడు. బాలుడిని గమనించిన స్థానికులు వెంటనే 'డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన బాలానగర్ సిఐ నర్సింహా రాజు సిబ్బంది, బాలుడి ఫోటోను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి గాలింపు చేపట్టారు. వాట్సాప్ సందేశాన్ని చూసిన గురుమూర్తి నగర్ వాసులు, బాలుడి తండ్రి మహేందర్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న తండ్రికి, అన్ని వివరాలు ఆరా తీసిన అనంతరం సిఐ నర్సింహా రాజు బాలుడిని అప్పగించారు. కుమారుడిని సురక్షితంగా చూసుకున్న తల్లిదండ్రులు ఆనంద బాష్పాలతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. బాలానగర్ పోలీసుల సాంకేతిక పరిజ్ఞానం, వేగవంతమైన చర్యలపై స్థానిక సంక్షేమ సంఘ సభ్యుల ప్రశంసలతో వెలువెత్తాయి.

# ఏటూరు నాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రారంభం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 25 ఏటూరు నాగారం** గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు అందుబాటులో ఏటూరు నాగారం డిగ్రీ కాలేజీ లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుంది.

2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏటూరు నాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులకు దోస్త్ ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. రేణుక తెలిపారు. ఏజెన్సీ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులు భవిష్యత్తు దృష్టి లో పెట్టుకొని ప్రధాన కూడలిలలో గోడ పత్రికలు పోస్టర్ లు అధ్యాపక బృందం అంటిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సందర్భంగా ప్రిన్సిపాల్ రేణుక అధ్యాపకులు జీవవేణి. జ్యోతి. ఫాతిమాలు మాట్లాడుతూ.

కళాశాలలో బి ఏ బి ఎస్ సి (బి జెడ్ సి ఎంపీసీ బీకాం (సి ఎ ఏ ఈ డి పి), బి ఎ(హెచ్ సి పి సి ఎ) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఈ విద్యాసంస్థ ప్రత్యేక గుర్తింపు పొందింది.

ఆధునిక సౌకర్యాలు -- సమగ్ర విద్య

విద్యార్థుల అభ్యాసానికి అనుకూలంగా కళాశాలలో పలు ఆధునిక సదుపాయాలు ఉన్నాయి

జూలాజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు

ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఒ కంప్యూటర్ ల్యాబ్‌లు

సీసీ కెమెరా సర్వైలెన్స్,

ఆర్ ఓ.తాగునీరు

డిజిటల్ లైబ్రరీ, వర్చువల్ క్లాస్‌రూమ్స్

స్మార్ట్ బోర్డులతో విద్యార్థి కేంద్రిత బోధన

విశాలమైన తరగతి గదులు, ఉచిత వైఫై

విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం

ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, క్యాంపులు

ఫీల్డ్ ట్రిప్స్ ద్వారా ప్రాక్టికల్ అభ్యాసం

యోగా, ధ్యానం, సెమినార్లు, వర్క్‌షాప్‌లు

ఫోటోగ్రఫీ, వెడ్డింగ్ వంటి అంశాల్లో ఉచిత సర్టిఫికేట్ కోర్సులు

క్రీడలు ఒ ఇతర సౌకర్యాలు

విస్తృత క్రీడా మైదానం

బాస్కెట్‌బాల్, షటిల్, క్రికెట్, ఇండోర్ గేమ్స్

ఆధునిక జిమ్ సదుపాయం

బాలికలకు ప్రత్యేక వెయిటింగ్ రూమ్, వేరు టాయిలెట్స్

జనరేటర్ సదుపాయం

కెరీర్ ఒ నైపుణ్యాభివృద్ధి

ప్రతి విద్యార్థికి ప్రభుత్వ స్కాలర్‌షిప్

ప్లేస్‌మెంట్ అవకాశాలు

పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ (పీజీ బీఈడీ గౌడ్ జాబ్స్)

స్కిల్ డెవలప్‌మెంట్ ఒ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ (ఈ డి సి) ద్వారా శిక్షణ

ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ద్వారా బాలికలకు ఆత్మవిశ్వాసం పెంపు

ప్రతిభలో ముందంజ

2007-08 విద్యా సంవత్సరం నుంచి ఈ కళాశాల, కాకతీయ యూనివర్సిటీ ఫలితాల్లో గ్రామీణ స్థాయిలో అగ్రగామిగా నిలుస్తోంది.

సంప్రదించండి

డా. నవీన్ (ఫిజికల్ సైన్స్)8099701289

సిహెచ్. వెంకటయ్య (హిస్టరీ): 9491317887

అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ సురేష్: 9491317887

శ్రీనివాస్

గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరుతోంది.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జీవవేణి, జ్యోతి, ఫాతిమా పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఓపెన్ టెన్త్ పరీక్షలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 25 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు ఏటూరు నాగారం జిల్లా పరిషత్ లో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాసి విద్యార్థులు 173 మందికి గాను 140 మంది హాజరై పరీక్షలు రాస్తున్నట్లు పరీక్ష నిర్వాహకులు తెలియజేశారు

ఏ లాంటి మాస్ కాపీ జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు మీటర్ దూరం వరకు బయట వారు ఎగ్జామ్ సెంటర్ కు అందుబాటు లో లేకుండా తగు చర్యలు తీసుకుందామని అన్నారు



# పట్లూర్ ఘనంగా 12వ సశీ ,పెళ్లిరోజు జరుపుకున్న పట్లూర్,సర్పంచ్ పరుశురాం దంపతులు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామ సర్పంచ్ 12వ సంవత్సరం పెళ్లి రోజు ఘనంగా జరుపుకోవడం జరిగిందని తెలిపారు, పెళ్లిరోజు సందర్భంగా నాయకులు సర్పంచ్ పరుశురామ్ తో బంధుమిత్రులు కలిసి పెళ్లిరోజు సందర్భంగాశాలువాతో సన్మానించి సర్పంచ్ పరుశురాంకుటుంబం నిండు నూరేళ్లు చల్లగాఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఇలాంటి పెళ్లి రోజులు మరెన్నో జరుపుకోవాలని ఇంకా అనేక పదవుల్లో వారు రాణించాలని ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవ చేసే భాగ్యం వారికి కల్పించాలని బంధుమిత్రులు స్నేహితులు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపి పెళ్లిరోజు పండుగ సంబరాలు జరుపుకోవడం జరిగిందనితెలిపారు

# సరసమైన, నాణ్యమైన విద్యకు సిటిజెన్స్ కౌన్సిల్ ప్రయత్నం



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 25 ఏప్రియల్ 2026**ది సిటిజెన్స్ కౌన్సిల్ సామాజిక రాజకీయ సంస్థ ప్రధాన లక్ష్యా లలో భాగంగా అందరికీ సరసమైన, నాణ్యమైన విద్య అందించడం మరియు రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009 ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు విద్యను అందించే దిశగా కౌన్సిల్ బృందం సీతారం ధూళిపాళ, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మొహమ్మద్, సుమ నళిని, బొడ్డు శ్రీధర్, దేవీప్రియ తది తరులు గీతాంజలి విద్యా వేదిక మరియు శ్లోక పాఠశాల లను సందర్శించడం జరిగినది. పాఠశాలల అధికారులతో సమావేశాల సందర్భంగా గీతాంజలి విద్యా వేదికలో ఇప్పటివరకు ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల పథకం కింద ఎవరూ బడిలో చేరలేదని తెలిసినది. నెలసరి ఫీజు వసూళ్లలో అగ్రగామిగా ఉంటూ ప్రతి సంవత్సరము పది శాతం ఎక్కువ చేస్తూ వసూలు చేస్తున్నారని, అందుకు పిల్లల తల్లి తండ్రులు ప్రశ్నిస్తే హెడ్ ఆఫీస్ కు మెయిల్ ద్వారా పిర్యాదు చెయ్యండని, ప్రతి చర్యగా కుటుంబ సభ్యులు మెయిల్ ద్వారా పిర్యాదు చేసినను స్పందన కరువైనదనీ స్థానిక ప్రజలు వాపోయారు. అయితే, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు మాత్రం ఫీజులో కొంత మేర రాయితీ అందిస్తున్నట్లు తెలిసినది. శ్లోక పాఠశాల విషయానికి వస్తే, ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల విద్యార్థులను పరిగణలోకి తీసుకుంటున్నారని, అలాగే విద్యార్థులకు నైతిక విలువల బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టుతున్నారని తెలిసింది.

# మాతృ మరణాలపై సమీక్ష డా. ఉమా గౌరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 25:**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, (24-04-2026) డీఎంహెచ్ఓ కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష సమావేశం (మీఫ్వతీఋశ్రీ ణమఫ్ష్ర =వజఱవష - వీఱ=)ను డా. ఉమాగౌరి , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో క్రింది మూడు కేసులను క్షుణ్ణంగా సమీక్షించడం జరిగింది :

1)ఉప్పల్ పిహెచ్‌సీ పరిధిలోని అమీనా బేగం

2)శ్రీరంగవరం పిహెచ్‌సీ పరిధిలోని సమీనా ఖాతూన్

3)కుత్బుల్లాపూర్ పిహెచ్‌సీ పరిధిలోని ఆలమ్ జహాన్.

ఈ సమీక్షలో ప్రతి కేసులో జరిగిన పరిస్థితులను విశ్లేషించి,మాతృ మరణాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించడం జరిగినది .

ఈ సందర్భంగా డా. ఉమాగౌరీ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి గారు మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన ఈ క్రింది సూచనలు జారీ చేయడం జరిగినది . గర్భిణీ స్త్రీలకు సమయానికి వైద్య సేవలు అందించడం, ప్రమాద సూచనలను ముందుగానే గుర్తించడం, రిఫరల్ సేవలను బలోపేతం చేయడం పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో మాతృ మరణాలను తగ్గించేందుకు అందరు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి పీహెచ్ సి / యూపీహెచ్ సి లలో తప్పనిసరిగా ఇ డి డి (ప్రసవ అంచనా తేది )క్యాలెండర్ అమర్చి అందులో హై రిస్క్ కేసులను రెడ్ మార్క్ తో గుర్తించి జాగ్రత్తగా ప్రతిరోజు ఫాలోఅప్ చేయవలసిందిగా, మాతా శిశు సంరక్షణ కార్డుద్వారా గర్భిణీ సంరక్షణ సేవలు మరియు రక్తహీనత సమస్యలను ముందుగానే గుర్తించి అత్యవసర సేవలను జాగ్రత్తగా అందించవలసిందిగా,తప్పనిసరిగా గృహ సందర్శనల ద్వారా గర్భిణీ ల ఆరోగ్య సేవలు మెరుగుపరచడం,పోషక ఆహారం గురించి, సాధారణ ప్రసావాల గురించి అవగాహన కలిగించడం ద్వారా మాతృ మరణాలు జరుగకుండా చూడవలేనని ఆదేశించడం జరిగినది.

ఈ సమావేశం లో డా. గీతా (ప్రోగ్రామ్ అధికారి), డా. సత్యవతి, డిప్యూటీ ణవీడనూ, డా. మాధవిలత (గైనకాలజిస్ట్), వసంత (ణఎ. ణజుమీా), సునంద మరియు సంబంధిత పీహెచ్ సి వైద్యాధికారులు డా.స్వర్ణలత, డా.ప్రతిభ గాయత్రి, డా.సౌషీల్య మరియు సూపెర్వైసర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా లు పాల్గొనడం జరిగినది .

# ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలి : జిల్లా వ్యవసాయ అధికారి, కే. చంద్రకళ

**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 25:** ప్రతి రైతు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి, కే. చంద్రకళ తెలిపారు. మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లాలోని రైతులు విధిగా ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ను అగ్రి స్టాక్ (తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ) లో నమోదు చేసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ ఐడీతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధి నేరుగా పొందవచ్చని, పత్తి, వరి కొనుగోలు, పంట రుణాలకు ఇది కీలకంగా ఉంటుందన్నారు. బీమా, సబ్సిడీలు, ఇతర పథకాలు వేగంగా అందుతాయని, ప్రభుత్వం అందించే పథకాల పారదర్శకత పెరుగుతుందని చెప్పారు.

రిజిస్ట్రేషన్ కు కావాల్సిన పత్రాలు:ఆధార్ కార్డు భూమి పట్టాపాస్ బుక్ఆధార్ కు లింక్ ఐన మొబైల్ నంబర్ (ఓటీపీ కోసం) వెంట తెచ్చుకోవాలన్నారు. ఆయా మండలాల వారీగా రైతులు తమ పరిధిలోని అగ్రికల్చర్ ఏ.ఈ.ఓల వద్ద (రైతు వేదికలలో) లేదా దగ్గర లోని అన్నిమీ-సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు రావాలని సూచించారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో భేటీ

విజయవాడ, ఏప్రిల్ 25, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. విజయవాడలోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవలే స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి సీఎం ఆరా తీశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను పరామర్శించిన చంద్రబాబు, ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, విధులకు హాజరు కావాలని ఆకాంక్షించారు. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరిన గవర్నర్, చికిత్స అనంతరం కోలుకుని లోక్ భవన్‌కు తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆయన్ను పరామర్శించేందుకు వెళ్లారు. ఈ భేటీ కేవలం మర్యాదపూర్వక పరామర్శ మాత్రమేనని అధికార వర్గాలు తెలిపాయి.

కన్నాతో సానా భేటీ

తెలుగుదేశం పార్టీ నాయకుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గుంటూరులోని ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఈరోజు ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. సతీష్ బాబును కన్నా లక్ష్మీనారాయణ ఆహ్వానించారు. అల్పాహార విందు అనంతరం ఇరువురు కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ కార్యక్రమంలో అరేటి అశోక్, తులసి ధర్మ చరణ్, చందనం శ్రీనివాస్, మాజీ మేయర్ కన్నా నాగరాజు, నాగేంద్ర, అసెంబ్లీ శ్రీనివాస్ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం, కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# షిరిడి సాయిబాబ పై దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం?

## షిరిడి సాయిబాబా ఐక్యవేదిక డిమాండ్...




**హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** సాయిబాబాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని షిరిడి సాయిబాబా ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికంటి ధనంజయ, కార్యదర్శి పి.వి. సాయి, ఖజాంచి గుండా మల్లయ్య మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో కొందరు సోషల్ మీడియా వేదికగా అసత్య, ఆధారరహిత ప్రచారాలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రవచనకారులు మైనంపాటి ప్రసాదు, సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, సాయిబాబాపై అబద్ధపు ప్రచారాలు చేసి సమాజంలో కల్లోలం సృష్టిస్తూ కొందరు యూట్యూబ్ వీడియోల ద్వారా లాభాలు పొందుతున్నారని విమర్శించారు. ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్న వారికి తగిన గుణపాఠం చెబుతామని, వెంటనే ఆపకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలపై దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. షిరిడి సాయిబాబా సంస్థలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నాయని, దీనిని సహించలేని కొందరు స్వార్థపరులు చేస్తున్న ఆరోపణలను భక్త సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించదని పేర్కొన్నారు.




ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు సాయిబాబా శ్రవణ్ కుమార్,హనుమంతు, ప్రసాద్ రావు, శ్రీదేవి,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగర్ మంగ్లీనే మైక్రోఫైనాన్స్ మోసానికి బాధ్యురాలు

## బాధితుల ఆరోపణ



**హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** సింగర్ మంగ్లీనే మైక్రోఫైనాన్స్ మోసానికి భాద్యురాలని ఉమ్మడి నల్గొండ బాదితులు పేర్కొన్నారు. కాయాకష్టం చేసుకుని జీవించేవాళ్లం, బందువుల వద్ద అప్పులు చేసి మరీ మంగ్లీ పై భరోసాతో మైక్రోఫైనాన్స్లో పెట్టుబడులు పెట్టామని బాదితుడు (రమావత్మధు క్యాషియర్) రమావత్ రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి నల్గొండ నుండి వచ్చిన 20 మంది బాదితులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. చిన్న పాటి పనులు చేసుకునే వాళ్లం అధికవడ్డీ ఆశకు మోసపోయామన్నారు. మంగ్లీ తమ కార్యాలయానికి వచ్చేదని అందకు సంబంధించిన ఫోటోలను మీడియాకు ప్రదర్శించారు. సమావేశంలో బంజారా నాయకులు సంపత్ నాయక్ మాట్లాడుతూ మోసం చేసిన మంగ్లీ తాను గిరిజన బిడ్డను అంటూ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మంగ్లీ గిరిజన కార్డును ఉపయోగించి తనను తాను రక్షించుకునే పనిలో ఉందని, అయితే మంగ్లీ చేత బాదింపబడిన వారు కూడా బాదితులనే విశయాన్ని మంగ్లీ గుర్తించాలని గుర్తు చేశారు. మంగ్లీ బాదితులు ఒక్కోక్కరు కాదు... వందల సంఖ్యలో ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. జాతి పేరు చెప్పుకుని స్వంత జాతి ప్రజలను మోసం చేయడం మంగ్లీకి ఉన్న విచక్షణ జ్ఞానానికి నిదర్శణమన్నారు. మైక్రోఫైనాన్స్లో పెట్టుబడులు కేవలం మంగ్లీ తమ్ముడు రమావత్ మధు, మంగ్లీలను చూసి మాత్రమే పెట్టుబడులు పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం మైక్రోఫైనాన్స్ విశయంలో జోక్యం చేసుకుని బాదితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ జాక్ నేత సంపత్ నాయక్, విప్లవ్, రేణు నాయక్, శ్రీనివాస్ నాయక్, రంజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ నాటికి పోలవరం జలాలు

కాకినాడ, ఏప్రిల్ 25,ఉత్తరాంధ్ర జిల్లాల సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో గోదావరి జలాలు అత్యంత కీలకమని, ఈ నీటిని తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జూన్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలను తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల సమీపంలో నేషనల్ హైవే క్రాసింగ్ వద్ద జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆయన, అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ఏజెన్సీలను హెచ్చరించారు. ముఖ్యంగా హైవే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి ఆరోపించారు.

జగన్ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలపై కక్ష గట్టి పనులను ప్రీ-క్లోజర్ చేసిందని, కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించి ప్రాంతీయ ప్రయోజనాలకు గండికొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును, రెండో ప్రాధాన్యతగా ఈ ఎడమ కాలువను సందర్శించారని గుర్తుచేశారు.ప్రస్తుతం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి పనులను పరుగులు పెట్టిస్తున్నామని, ఇప్పటివరకు 76 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం వల్ల 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే మరో 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మందికి శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. అలాగే పాయకారావుపేట ఎగువన ఉన్న 98 ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాలకు నీరందుతుందని పేర్కొన్నారు. కుమ్మరిలోవ నిర్వాసితులకు రూ.30.38 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వెల్లడించిన మంత్రి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

# మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

## నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి శుభాకాంక్షలు




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 25:** నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి.

శని వారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరం లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓ ననుసరించి నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతకుముందు కమిటీ సభ్యులు అక్రిడిటేషన్ ప్రక్రియ గురించి తమ అనుభవాలను పంచుకొని, ఈ ప్రక్రియ సజావుగా మరియు పారదర్శకంగా సాగే విధంగా పలు సూచనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా అదనపు కలెక్టర్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

# ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు అంత్యక్రియల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



సంగారెడ్డి జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు అంత్యక్రియలకు నారాయణఖేడ్ పట్టణంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరై, వెంకటరాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా





ఉంటుందని, వెంకటరాములకు రావలసిన అన్ని రకాల ప్రయోజనాలు (బెనిఫిట్స్) సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు తేది 23.04.2026న నారాయణఖేడ్ నుండి జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌కు బైక్‌పై వెళ్తుండగా, ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో న్యాల్కల్ మండలం, చాల్కి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కొండాపూర్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ శివలింగం, జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్, నారాయణఖేడ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన చట్టాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించకూడదు.

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి ఏప్రిల్ 25 ములుగు** శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ హక్కుల, పేసా, ఎల్.టి.ఆర్ చట్టాలపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, పోలీస్, అటవీ, రెవెన్యూ, అధికారులకు గిరిజన చట్టాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన అటవీ హక్కుల చట్టం, పేసా చట్టం, భూ బదిలీ నియంత్రణ ( ఎల్ టి ఆర్) చట్టాలపై అధికారులకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి అవగాహనతో చట్టాలను అమలు చేయాలని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ ఏపీవో నాగోరావు, డిఆర్డిఏ పిడి చంద్రశేఖర్, అన్ని మండలాల తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఫారెస్ట్, పోలీస్ అధికారులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు








**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఐసీసీసీ లో మర్యాదపూర్వకం గా కలిసిన డీజీపీ (DGP) ర్యాంక్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు ,స్వాతి లక్రా ,మహేష్ భాగవత్ ,చారు సిన్హా ,డా. అనిల్ కుమార్ ,వి.సి. సజ్జనార్ .

# జనగణనలో భాగంగా రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** 25 ఏప్రిల్, 2026జనగణన-2027లో భాగంగా తెలంగాణ రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, తెలంగాణ డైరెక్టర్ శ్రీమతి భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె పత్రికా సమావేశంలో మాట్లాడారు.

ఈసారి జరుగుతున్న జనగణన ప్రాముఖ్యతను శ్రీమతి భారతీ హోళికెరి వివరిస్తూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి కులగణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని పేర్కొన్నారు. ముఖ్యంగా మొదటిసారిగా జనగణన ప్రక్రియలో ఈసారి సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ పాటిస్తున్నామని, ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు.

ప్రజలు https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా, సొంతంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని శ్రీమతి భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ అనేది తప్పనిసరి కాదని, కేవలం ప్రజలకు ఒక సౌలభ్యం మాత్రమేనని, దీని వల్ల జనగణనలో డేటా సేకరణ వేగవంతమవుతుందని, క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గుతుందని ఆమె చెప్పారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సహా 16 భాషల్లో పోర్టల్ పనిచేస్తుందని, ఈ పోర్టల్ అత్యంత సురక్షితమైనదని, ఇందులో డేటా సురక్షితంగా ఉంటుందని తెలిపారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా పోర్టల్‌లో ఉన్న సమాచారం నివృత్తి చేస్తుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 1855 హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి కూడా తెలుసుకోవచ్చని చెప్పారు.

జనగణనలోని మొత్తం 33 ప్రశ్నలకు గానూ సెల్ఫ్-ఎన్యుమరేషన్ ద్వారా 27 ప్రశ్నలకు జవాబులు ఇవ్వొచ్చని, మిగతా ఆరు ప్రశ్నలకు సమాధానాలను జనగణన ఎన్యుమరేటర్ వచ్చి నమోదు చేసుకుంటారని తెలిపారు. ప్రజలు ఎలాంటి డాక్యుమెంట్లు, ఫోటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియలో జియోఫెన్సింగ్ ఉండదని, ప్రజలు ఎక్కడినుంచైనా ఈ ప్రక్రియను పూర్తిచేయవచ్చని అన్నారు.

జనగణన అనేది అన్ని సర్వేలకు మాతృసర్వే వంటిదని, జనగణన ద్వారా సమగ్రమైన డేటా వస్తుందని ఆమె పేర్కొన్నారు. సరైన విధానాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు జనగణన డేటా అత్యంత కీలకమని అన్నారు. మన కోసం, మన పిల్లల కోసం, భావి తరాల కోసం ఈ జనగణన ముఖ్యమైనదని, కాబట్టి, ప్రజలు కచ్చితత్వంతో తమ వివరాలను ఇవ్వాలని, ఇది ప్రజల బాధ్యత అని ఆమె అన్నారు. జనగణనలో వచ్చే డేటా క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించే అద్దంలా ఉండాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో జనగణన ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వివరించారు. ఒక డివిజన్‌ను యూనిట్‌గా తీసుకొని జనగణన జరపనున్నట్టు చెప్పారు. క్యూర్ పరిధిలో 21,866 ఎన్యుమరేటర్లు, 3,652 మంది సూపర్‌వైజర్లు జనగణన విధుల్లో ఉంటారని, సర్కిల్‌కు ఒకరు చొప్పున 60 మంది డిప్యూటీ కమిషనర్లు ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారని, కంటోన్మెంట్‌కు ఒకరు ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

అనంతరం జనగణనకు సంబంధించిన పోస్టర్, ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు.

## కృష్ణ , ప్రేమ్ కుమార్, ఆధ్వర్యంలో నెల్లూరు నారాయణ సహకారంతో దాదాపు 500 మందికి అన్న ప్రసాద వితరణ







**సనత్‌నగర్ ప్రజాబలం ప్రతినిధి:** శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం, బల్కంపేట్ అమ్మవారి ఆలయం ఎదురు ప్రాంగణంలో ముత్యాల కృష్ణ , ప్రేమ్ కుమార్, ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి శనివారం రోజు చేస్తున్నటువంటి అన్నదాన కార్యక్రమం భాగంగా ఈ శనివారం దాత నెల్లూరు నారాయణ సహకారంతో శనివారంనాడు దాదాపు 500 మందికి అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో అమీర్ పేట్ డివిజన్ BRS పార్టీ అధ్యక్షులు ఎం.హనుమంతరావు, ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించడం జరిగింది వారితోపాటు స్థానిక నాయకులు, వనం శ్రీనివాస్,రంగా రణధీర్ గౌడ్, పోతురాజు కుమార్, మహేష్ యాదవ్, మైలారం పాండు, ఎర్రోళ్ల మోహన్, కాంతారావు, ముత్యాల నిఖిల్, నరసింహ, సునీల్, తదితరులు పాల్గొన్నారు

# చంద్రబాబుకు అవార్డు...

విజయవాడ, ఏప్రిల్ 25, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరో అరుదైన జాతీయ స్థాయి గౌరవాన్ని అందుకోబోతున్నారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ ప్రకటించిన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. రాష్ట్రంలో పాలనను పరుగులు పెట్టిస్తూ, వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తూ ఆయన అమలు చేస్తున్న విప్లవాత్మక విధానాలకు గుర్తింపుగా ఈ పురస్కారం వరించింది. ఈ అవార్డును అందుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ముంబైలో పర్యటించనున్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పాటు 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' వంటి విధానాలను పక్కాగా అమలు చేస్తూ, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు చూపుతున్న చొరవను ఎకనమిక్ టైమ్స్ జ్యూరీ ప్రత్యేకంగా ప్రశంసించింది. ముఖ్యంగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రాష్ట్రానికి సుమారు రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకురావడంలో ఆయన సఫలీకృతం కావడం ఈ అవార్డు ఎంపికలో కీలక పాత్ర పోషించింది.

పారిశ్రామిక అనుమతుల ప్రక్రియను సరళతరం చేయడం, టెక్నాలజీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి భవిష్యత్ రంగాల్లో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే ఆయన లక్ష్యాన్ని జ్యూరీ కొనియాడింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ పటంలో నిలబెట్టిన అనుభవాన్ని ప్రస్తుత నవ్యాంధ్ర నిర్మాణంలోనూ చంద్రబాబు ప్రదర్శిస్తున్నారని పేర్కొంది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com